

పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. పున:దర్శనం గురువారం


# కలం నిఘా

WWW.KALAMNIGHA.COM

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ మంగళవారం 14 జనవరి 2025

సంపుటి: 14, సంచిక: 286 పేజీలు 8, వెల: 4.00

Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam




దివంగత మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ డాక్టర్ మర్రి చెన్నారెడ్డి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

హైదరాబాద్ జనవరి 13 (నిఘా న్యూస్):



## సంక్షేమ పథకాలకు 45 కోట్ల వేల వ్యయం

**మరెక్కడా లేని విధంగా తెలంగాణలో పథకాల అమలు**

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**ఖమ్మం జనవరి 13(నిఘా న్యూస్):** ప్రజా సంక్షేమం కోసం దేశంలో ఎక్కడ కూడా తెలంగాణలో ఉన్నటువంటి వంటి పథకాలు లేవని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రైతు రుణం, ధాన్యం బోనస్ చారిత్రాత్మకమైన పథకాలు తెలంగాణ సర్కార్ ఇస్తుందన్నారు. రైతు ..మిగతా 2లో



## కౌశిక్ రెడ్డి అరెస్ట్

**ఆయనపై పలు కేసులు నమోదు**

2

## కౌశిక్ రెడ్డిపై స్పీకర్‌కు ఫిర్యాదు

**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్**

# నేతల దర్శకత్వంలోనే...
# కోడి పందాలు

**అనుమతులతో లెక్కలేదు.. బరుల ఏర్పాటు యధాతథం**

**గుట్టుచప్పుడు కాకుండా కోడి పందాల జూదం**

**చేతులెత్తేసిన పోలీసు యంత్రాంగం**

**న్యాయస్థానం ఆదేశాలు బేఖాతరు**



**భీమవరం జనవరి, 13 (నిఘా న్యూస్):** సంక్రాంతి కోడి పందాలకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా భారీగా బరులు రెడీ అయ్యాయి. పదాల నిర్వాహకులు అనుమతుల కోసం ఎదురుచూస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు నేరుగా పందాల నిర్వాహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వందకుపైగా కీలక బరులు ప్రారంభించడానికి సర్వం సిద్ధమైంది. అయితే ఇప్పటికే రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం కోడిపందాల బరులు ఏర్పాటు కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చినప్పటికీ అవి ఈ పండుగ సీజన్‌లో ఖచ్చితంగా అమలయ్యే అవకాశాలు లేనట్టు తెలుస్తుంది. పోలీసు యంత్రాంగం కూడా చేతులెత్తేయడంతో పబ్లిక్‌గా బరులు ప్రధాన రహదారుల చెంతనే ఏర్పాటవుతున్నాయి.వీటిని ప్రారంభించేందుకు ప్రజాప్రతినిధులు సైతం ముందుకు వస్తుండడంతో అధికారులు చేతులెత్తేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సంక్రాంతి పర్వదినాల ముసుగులో జూద క్రీడల నిర్వహణకు జోరుగా సన్నాహాలు జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు జోరుగా కోడిపందేలు, జూదాలు నిర్వహించేందుకు పందెం రాయుళ్లు అందుకనుగుణంగా సన్నాహాలు చేస్తున్నారు. ప్రధానంగా ఉభయ గోదావరి జిల్లాలవ్యాప్తంగా కోడిపందాల నిర్వాహణకు బరులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో కొబ్బరితోటలు, ఖాళీ ప్రదేశాలను ఎంపిక చేసుకుని అక్కడ ట్రాక్టర్లుతో చదును పనులు చేయిస్తున్నారు. మరో పక్క కోడిపందాలతో పాటు వాటి చెంతనే గుండాటలు ఆడుకునేందుకు రూ.లక్షల్లో అంతర్గత ఒప్పందాలు జరిగిపోతున్నాయని చెబుతున్నారు. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే కోడి పందాలు ..మిగతా 2లో



## ప్రగతి భవన్‌కు వస్తానంటున్న హరీష్

**భట్టి మాటలు పచ్చి అబద్దాలని నిరూపిస్తాను**

**ఒక్క ఎకరం కాదు, ఆరు లక్షల ఎకరాలకు నీరు ఇచ్చాము**

**పడావు పడ్డ భూముల్లో పచ్చని పంట పొలాలను సృష్టించాము**

**సిద్దిపేట ఎమ్మెల్యే మాజీమంత్రి హరీష్ రావు**

**సంగారెడ్డి జనవరి 13 (నిఘా న్యూస్):** రాష్టంలో అబద్దాల ప్రభుత్వం కొంసాగుతుందని, ప్రభుత్వం చెప్పే మాట్లాలకు చేసే పనులకు పొంత లేదని రాష్ట్ర మాజీ మంత్రి బి ఆర్ ఎస్ పార్టీ సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఆదివారం స్థానికఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కార్యలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అడుగడుగునా మోసం చేస్తుందన్నారు. రైతుల విషయంలో మాటలు కోటలు దాటుతున్నాయి కానీ చేతలు గడప దటడం లేదన్నారు. రైతులకు ముఖ్యమంత్రి చెక్కు ఇచ్చాడ న్నారు. కానీ ఇప్పటివరకు కూడ రైతుల ఖాతాలో డబ్బులు జమ ..మిగతా 2లో



2

## భోగి మంటలతో బాధలకు స్వస్తి

**తెలుగు రాష్ట్రాలలో ఘనంగా భోగి వేడుకలు**

# తొలిరోజు కోటిన్నర మంది స్నానాలు

**ప్రారంభమైన మహా కుంభమేళా**



**ప్రయాగ్‌రాజ్ జనవరి 13 (నిఘా న్యూస్):** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయోగ్‌రాజ్ లో ప్రారంభమైన మహా కుంభమేళాకు తొలిరోజే భక్తులు పోటెత్తారు. గంగ, యమున, సరస్వతీ నదుల సంగమంలో 1.5 కోట్ల మంది పవిత్ర స్నానాలు చేశారు. సోమవారం పుష్య పౌర్ణమి సందర్భంగా బీహార్, హర్యానా, బెంగాల్, ఒడిశా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలి రావడంతో వివిధ ఘాట్లు కిటకిలలాడాయి. మహాకుంభమేళా వేలాదిగా తరలి వస్తున్న భక్తులకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అభినందనలు తెలిపారు. పుష్యమాస పౌర్ణమి రోజున త్రివేణి సంఘంలో పవిత్ర స్నానాల కోసం విచ్చేసి సాధువులు, కల్పవాసీలు, భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహా కుంభమేళా ..మిగతా 2లో

# సంక్రాంతి వేడుకల్లో ప్రధాని మోడీ



**కిషన్ రెడ్డి నివాసంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు**

**ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోడీ,స్పీకర్ ఓం బిర్లా, చిరంజీవి కేంద్రమంత్రులు**

**న్యూఢిల్లీ జనవరి13 (నిఘా న్యూస్):** తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. రంగురంగుల రంగవల్లులతో గ్రామాలు, పట్టణాలు ముస్తాబు ..మిగతా 2లో





## జడ్ మోడ్ సొరంగాన్ని ప్రారంభించిన ప్రధాని

**జడ్ మోడ్ సొరంగం పొడవు 6.5 కిలోమీటర్లు**

**టన్నెల్ నిర్మాణం కోసం ఏకంగా రూ.2,500 కోట్లు ఖర్చు**

**న్యూఢిల్లీ, జనవరి 13 (నిఘా న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం జమ్ముకశ్మీర్‌లోని సోన్‌మార్గ్ ప్రాంతంలో జడ్ మోడ్ సొరంగాన్ని ప్రారంభించారు. ప్రధాని రాక నేపథ్యంలో జమ్ముకశ్మీర్‌లో అధికారులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. టన్నెల్ ప్రారంభోత్సవంలో జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తదితరులు పాల్గొన్నారు. శ్రీనగర్ నుంచి కార్గిల్ వెళ్లే దారిలో శ్రీనగర్-లేష్ జాతీయ రహదారిపై ఈ టన్నెల్‌ను నిర్మించారు. ఈ టన్నెల్ నిర్మాణం కోసం ఏకంగా రూ.2,500 కోట్లు ఖర్చు చేశారు. భారత రక్షణ రంగానికి వ్యూహాత్మకంగా ఈ టన్నెల్ చాలా కీలకం కానుంది. ఈ జడ్ మోడ్ సొరంగం 6.5 కిలోమీటర్ల పొడవు ఉంది. ఈ టన్నెల్ ద్వారా ఏ సీజన్‌లోనైనా లడఖ్‌కు చేరుకోవడానికి వీలవుతుంది. టన్నెల్‌కు సంబంధించి 2015లో ప్రారంభమైన నిర్మాణ పనులు గత ఏడాది పూర్తయ్యాయి. ఈ జెడ్ మోడ్ టన్నెల్ భారత్‌కు వ్యూహాత్మకంగా చాలా కీలకమైనది. దాదాపు సముద్రమట్టానికి 8,500 అడుగుల ఎత్తులో దీన్ని నిర్మించారు. అత్యంత శీతలమైన లడఖ్‌ను ఏ సీజన్‌లో అయినా సందర్శించేందుకు ఈ టన్నెల్ ఉపయోగపడనుంది. ఈ సొరంగం రవాణా వ్యవస్థతోపాటు రక్షణ వ్యవస్థకు కూడా కీలకం కానుంది. ప్రతికూల ..మిగతా 2లో

# పేదరికమే అర్హతగా సంక్షేమ పథకాల అమలు



**కూసుమంచిలో ఇందిరమ్మ నమూన ఇళ్లు ప్రారంభం**

**రాబోయే నాలుగు ఏళ్లల్లో 20 లక్షల ఇళ్లు లక్ష్యం**

**ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమం నిరంతర ప్రక్రియ**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**కూసుమంచి జనవరి 13(నిఘా న్యూస్):** కులం లేదు మతం లేదు ఏ పార్టీ అని అడగం సంక్షేమం ఇస్తే వచ్చేసారి మా పార్టీకి ఓటు వేయాలనే నిబంధన పెట్టం కేవలం పేదోడు అయితే చాలు ఇందిరమ్మ రాజ్యంలో అమలు చేసే ప్రతీ సంక్షేమ పథకానికి అర్హుడేనని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కూసుమంచిలోని మండల ఆఫీస్ కంప్లెక్స్ లో నిర్మించిన నమూన ఇందిరమ్మ ఇళ్లు ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు ఎంత ఆనందంగా ఉన్నారో ఈ ఆనందం ..మిగతా 2లో



## సమిష్టి నిర్ణయాలతోనే భక్తులకు సేవలు

**తొక్కిసలాట ఘటనలో బాధితులకు పరిహారం చెల్లింపు**

**సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు తగవు**

**స్పష్టం చేసిన టీటీడీ ఈవో, చైర్మన్**

**తిరుమల జనవరి 13(నిఘా న్యూస్):** తిరుపతి తొక్కిసలాట ఘటన తర్వాత సోషల్ మీడియాలో టీటీడీపై రకరకాల పోస్టులు పెడుతున్నారు. అయితే, సోషల్ మీడియాలో టీటీడీపై తప్పువు వార్తలు ప్రచారం చేయడం ..మిగతా 2లో

## ఎట్టకేలకు తెలంగాణకు పసుపు బోర్డు

**బోర్డు చైర్మన్‌గా పల్లె గంగారెడ్డి నియామకం**



**న్యూఢిల్లీ జనవరి 13(నిఘా న్యూస్):** తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సంక్రాంతి పండుగ సందర్భంగా శుభవార్త అందించింది. నిజామాబాద్ కేంద్రంగా కొత్తగా పసుపు బోర్డ్ ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ..మిగతా 2లో

## ప్రధాని మోడీ వల్లే... శాంతి భద్రతలు సాధ్యమైంది

**ఎన్నికల నిర్వహణ హామీ నిలబెట్టుకున్న మోడీ**

**ప్రధాని మోడీపై ప్రశంసలు కురిపించిన సీఎం ఒమర్ అబ్దుల్లా**





2



## తొలిరోజు కోటిన్నర మంది స్నానాలు

మొదటి పేజీ తరువాయి...

తొలిరోజు సనాతన ధర్మాన్ని ఆచరించే 1.50 కోట్ల మంది స్వచ్ఛమైన త్రివేణీ జలాల్లో పవిత్ర స్నానాలు చేయడం ద్వారా ఈ పండుగను విజయవంతం చేశారు. ఇందుకు సహకరించిన మహాకుంభ మేళా అడ్మినిస్ట్రేషన్, ప్రయాగ్‌రాజ్ అడ్మినిస్ట్రేషన్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రయాగరాజ్, స్వచ్ఛాగ్రహీలు, గంగా సేవాదూత్‌లు, కుంభ్ సేవక్లు, మత-సామాజిక సంస్థలు, వివిధ వాలంటీర్లు, మిత్రులు, మీడియా ప్రపంచం సహా మహాకుంభ్‌తో మమేకమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను' అని యోగి పేర్కొన్నారు. 'మహాకుంభ్' భిన్నత్వంలో ఏకత్వం సందేశాన్ని చాటుతూ భిన్న సంస్కృతులను ఏకం చేస్తోందని యోగి ఆదిత్యనాథ్ ఒక ట్వీట్‌లో అభివర్ణించారు. సాంస్కృతీ సమ్మేళనం ఎక్కడుంటుందో విశ్వాసం, సామరస్యం అక్కడే ఉంటుందన్నారు. ప్రయోగ్‌రాజ్ సనాతన ధర్మానికి ప్రతీకగా నిలుస్తోందని చెప్పారు. కాగా, తెల్లవారు జాము నుంచి దట్టమైన పొగమంచు, తీవ్రమైన చలిగాలులు ఉన్నప్పటికీ లెక్కచేయకుండా వేలాది మంది భక్తులు త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానాలకు ఎంతో ఉత్సాహంగా తరలివచ్చారు. వయోభేదం లేకుండా అన్ని రంగాలకు చెందిన ప్రజలు పవిత్ర స్నానాలతో పులకించిపోయారు. భజనలు, జై గంగా మయ్యా నినాదాలు మధ్య 'మహాకుంభ్' అంగరంగ వైభవంగా మొదల్కెంది.

## భోగి మంటలతో బాధలకు స్వస్తి

హైదరాబాద్/విజయవాడ జనవరి 13(నిఘా న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో భోగి వేడుకలు సంబరంగా సాగాయి. వేకువ జాముఉనే భోగిమంటలు వేశారు. ముందర భోగి మంటలు మండుతున్నాయి. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఆ వీధిలోని వారందరూ తమతమ ఇళ్ళ ముందర భోగి మంటలు వేసి, వాటి చుట్టూ కూర్చుని సంతోషంగా కబుర్లు చెప్పుకుంటూ చలి కాచుకున్నారు. బంధాలను చిక్కపరుస్తాయి. జ్ఞాపకాలను పదిలపరుస్తాయి. భోగము అంటే ఆనందం. భోగము అంటే సంతోషం. బాధలకు స్వస్తి పలికి, ఆనందాలను ఆహ్వానించడమే భోగి పండగ పరమార్థం. అందుకే మనకు భారంగా ఉండే అవసరం లేని, ఉపయోగం లేని వస్తువులను భోగి మంటల్లో పడేస్తాం. ప్రకాశం జిల్లా టంగుటూరు తూర్పు నాయుడుపాలెంలోని తన నివాసంలో భోగి వేడుకల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ భోగి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగను కుటుంబ సభ్యులతో ప్రతి ఒక్కరు ఆనందంగా జరుపుకోవాలి. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం పాటు పడుతోందన్నారు. సంక్రాంతి కానుకగా ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు, చిరు వ్యాపారులకు, కాంట్రాక్టర్లు, పోలీసు సిబ్బందికి బకాయిలు రూ.6,700 కోట్లు విడుదల చేశామన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కార్యాలయంలో సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో వచ్చిన నాదెండ్ల మనోహర్ కు జనసేన వీరనారిమణులు స్వాగతం పలికారు. స్థానిక జనసేన తెనాలి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి ఉత్సవాల్లో చిన్నారులతో కలిసి సోమవారం భోగిమంటలు వెలిగించారు.సంక్రాంతి భోగి పండుగ పురస్కరించుకొని సోమవారం కదిరి పట్టణం హిందూపూర్ రోడ్డు లోని శ్రీలక్ష్మీ నరసింహ నగర్ లోని సుమారు 30 కుటుంబాలు వేకువజామున ఒక చోటికి చేరుకుని భోగి మంటలు వేసి సంక్రాంతి ముగ్గులు వేసి, భోగి మంటను వెలిగించి మహిళలు పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొని నృత్యాలు చేస్తూ పల్లెటూరి సంప్రదాయ వాతావరణంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు.

## సంక్షేమ పథకాలకు 45 కోట్ల వేల వ్యయం

మొదటి పేజీ తరువాయి...

భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలకు 45 వేల కోట్ల రూపాయాలు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఖమ్మం జిల్లాలో మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసాకు 19 వేల కోట్ల రూపాయలు, ఆత్మీయ భరోసాకు రెండు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇక, ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అన్ని పథకాలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. ప్రతి స్కీంలో కన్ఫ్యూజన్ ఏం లేదు. పథకాలపై సమీక్ష సమావేశాలు నిర్వహించారు. అలాగే, ఉపాధి హామీ పథకంలో సభ్యులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులు అని వెల్లడిరచారు. ఇందులో సెంట్ భూమి లేని వారికి వర్తిస్తుంది అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన స్పష్టత ప్రభుత్వం దగ్గర ఉంది. అధికారులు ఇందిరమ్మ కమిటీలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామాల్లో గ్రామసభ డయాస్ ఏర్పాటు చేసి చర్చించాలి. గ్రామాల్లో మూడు చోట్ల ప్లెక్సీలని ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

## జడ్ మోడ్ సొరంగాన్ని ప్రారంభించిన ప్రధాని

మొదటి పేజీ తరువాయి...

వాతావరణ పరిస్థితుల్లోనూ సోనామార్గ్ పట్టణానికి టన్నెల్ ద్వారా వెళ్లొచ్చు. జమ్ముకశ్మీర్‌లో 'జడ్ మోడ్' టన్నెల్ ఏర్పాటుతో కార్గిల్ మరింత సురక్షితంగా మారింది. గతంలో కార్గిల్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడగా భారత్ ఏకంగా యుద్ధమే చేయాల్సి వచ్చింది. శీతాకాలంలో తీవ్రంగా మంచు కురిసే సమయాన్ని ఆసరా చేసుకుని ఉగ్రవాదులు భద్రతాబలగాలపై దాడులకు తెగబడ్డారు. అప్పట్లో కార్గిల్ ప్రాంతం పాకిస్థాన్ ఉగ్రవాదుల హస్తగతమైతే శ్రీనగర్ లేహ్ మధ్య రాకపోకలు నిలిచిపోయేవి. ఇప్పుడు సొరంగం ద్వారా సైన్యం కార్గిల్‌కు వేగంగా చేరుకునే అవకాశం ఉంది.

# సంక్రాంతి వేడుకల్లో ప్రధాని మోడీ





మొదటి పేజీ తరువాయి...

కాగా, కోడి పందేలు, ఎడ్ల పందేలతో పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఇంట్లో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. దేశ రాజధాని ఢిల్లీలోని ఆయన నివాసంలో సోమవారం నిర్వహించిన వేడుకలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కృతనిశ్చయంతో పని చేస్తున్నారని వెల్లడించారు. ఈ వేడుకల్లో స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు, సినీనటుడు చిరంజీవి, ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, పీవీ సింధు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను మోదీ వీక్షించారు. గాయని సునీత పాటలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి వెంకటేశ్వరస్వామి ప్రతిమను కిషన్‌రెడ్డి అందజేశారు. ఎంపీలు లక్ష్మణ్, అనురాగ్ ఠాకూర్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, లక్ష్మణ్, గోడెం నగేష్, బాలశౌరి, కొండ విశ్వేశ్వర్ రెడ్డి , డి.కె.అరుణ సహా పలువురు తెలంగాణ బీజేపీ నేతలు సైతం వేడుకలో పాల్గొన్నారు. అలాగే లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, జ్యోతి రాధిత్య సింధియా, మనోహర్ లాల్ కట్టర్, పెమ్మసాని చంద్రశేఖర్, బండి సంజయ్, సతీశ్ చంద్ర దూబే, శ్రీనివాస్ వర్మ హాజరయ్యారు. మరోవైపు పలువురు ఎంపీలు, పారిశ్రామికవేత్తలు, బీజేపీ నేతలు కిషన్ రెడ్డి నివాసానికి భారీగా చేరుకున్నారు. కేంద్ర మంత్రి నివాసానికి చేరుకున్న ప్రధాని మోదీకి కిషన్ రెడ్డి, చిరంజీవి, పెమ్మసాని చంద్రశేఖర్ సాదర స్వాగతం పలికారు. సంక్రాంతి వేడుకల నేపథ్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా కిషన్ రెడ్డి ఇంటిని ముస్తాబు చేశారు. అతిథులకు తెలుగు వంటలను సైతం రుచి చూపించేలా పలు వంటకాలను సిద్ధం చేశారు.

## సమిష్టి నిర్ణయాలతోనే భక్తులకు సేవలు



మొదటి పేజీ తరువాయి...

దురదృష్టకరం అని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో సోమవారం టిటిడి ఈవో, టిటిడి అదనపు ఈవోలతో కలసి టిటిడి ఛైర్మెన్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. దర్శన టిక్కెట్లు తిరుపతిలోనే జారి చేస్తామని స్పష్టం చేశారు.అయితే, మార్పులు చేయాల్సి వస్తే వచ్చే ఏడాదికి నిర్ణయం తీసుకుంటాం అన్నారు. తొక్కిసలాట ఘటనపై సీఎం నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు.ఆ ఒక్క ఘటన మినహా మిగిలినవి అన్ని బాగా జరిగాయని తెలిపారు. తిరుమల శ్రీవారి భక్తులకు మరింత మెరుగైన, పటిష్టమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు సమిష్టిగా నిర్ణయాలు తీసుకుంటున్నామని టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మెన్ శ్రీ బీఆర్ నాయుడు మాట్లాడుతూ శ్రీవారి భక్తులకు పాదర్శకంగా సేవలు అందించేందుకు పాలక మండలిలో సమిష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. పాలకమండలి తీసుకునే నిర్ణయాలను అమలు చేయడంలో కొన్ని సాంకేతిక కారణాలతో ఆలస్యం అవుతుండవచ్చునేమో కాని, ఆలస్యం అవుతోందని తొందరపడి అసత్య ప్రచారం చేయవద్దని మీడియాను విజ్ఞప్తి చేశారు. తిరుమల విషయంలో ఒకటికి రెండు సార్లు పరిశీలించి, సంబంధిత వ్యక్తుల నుంచి వాస్తవ సమాచారాన్ని తెలుసుకుని వార్తలు రాయాలని సూచించారు. ఒకరిద్దరు మీడియా, సోషల్ మీడియాలో టిటిడి ఛైర్మెన్ కు, ఈవో శ్యామల రావుకు మనస్పర్థలు ఉన్నాయంటూ వార్తలు రాయడం సరికాదన్నారు. వైకుంఠ ఏకాదశికి శ్రీవారి భక్తులకు మెరుగైన సేవలు అందించామన్నారు. విద్యుత్ కాంతులు, పుష్పాలంకరణలు, క్యూల్కెన్లు, శ్రీవారి దర్శనం, అన్న ప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలలో మరింత నాణ్యతగా అందించామన్నారు. తిరుపతిలో జరిగిన తోపులాట సంఘటన జరగడం సీఎం నారా చంద్రబాబు నాయుడు, తమను, దేశాన్ని, ప్రపంచాన్ని భాధించిందన్నారు. ఈ సంఘటనలో మృతి చెందిన కుటుంబాలకు , తీవ్రంగా గాయపడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 31 మందికి పరిహారం అందించామని, మరో 20 మందికి రెండు మూడు రోజుల్లో పరిహారం అందిస్తామన్నారు. చిన్న పొరపాట్లు చేయకుండా చాలా ముందు జాగ్రత్తతో సేవలు అందిస్తున్నామన్నారు. టిటిడికి సంబంధించి సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయవద్దని టిటిడి ఈవో జె. శ్యామలరావు విన్నవించారు. కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియా చేస్తున్న అసత్య వార్తలను నమ్మవద్దని సూచించారు. టిటిడిలో పాలక మండలిలో చర్చించి తీసుకునే నిర్ణయాలను అమలు చేయడం తమ బాధ్యతన్నారు. టిటిడి ఛైర్మెన్ , ఈవో మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవు, సమన్వయ లోపం అసలు లేదన్నారు. టిటిడి ఛైర్మెన్ ను నేను ఏకవచంతో మాట్లాడినట్లు వచ్చిన వార్తలు నిజం కాదన్నారు. సాధారణ భక్తులకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించిన సూచన మేరకు అమలు చేస్తున్నామన్నారు. గత 6 నెలల కాలంలో భక్తులకు నాణ్యమైన అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలు, నెయ్యి సేకరణ, వసతి తదితర సేవలు అందిస్తున్నామన్నారు. టిటిడిలో దళారి వ్యవస్థను పూర్తిగా కట్టడి చేస్తున్నామని, ఆన్ లైన్ లో మోసాలను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా టిటిడి విజిలెన్స్ విభాగం గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. టిటిడిలో విజన్ డాక్యుమెంట్ ప్రకారం మాస్టర్ ప్లాన్ ను అమలు చేస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన సందర్భాలలో వివిధ రంగాల నిపుణుల సూచనలు, సహకారం తీసుకోవడం గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు టిటిడి ఈవో మాట్లాడుతూ తిరుమలలో భక్తులకు శ్రీవారి దర్శనం, క్యూల్కెన్లు, అన్నప్రసాదాలు, కంపార్ట్‌మెంట్ల నిర్వహణ, వసతి, మరుగుదొడ్ల నిర్వహణ, తదితర అంశాలు పూర్తిగా టిటిడి పరిధిలో ఉంటుందన్నారు. తిరుపతిలో జన రద్దీని ఎలా అదుపు చేయాలి, జన రద్దీ నిర్వహణ, క్యూల్కెన్ మేనేజ్మెంట్ , భద్రతా ఏర్పాట్లు, క్యూల్కెన్లు ఎక్కడ ఏర్పాటు చేయాలి, ఎంత ఎత్తులో ఉండాలి, ఎన్ని ఏర్పాటు చేయాలి, వాటి పటిష్టత ఎంత ఉండాలనే అంశాలు పూర్తిగా జిల్లా మేజిస్ట్రేట్ , జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో ఉంటుందన్నారు. వారి సూచనల మేరకు టిటిడి ఏర్పాట్లు చేసిందన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో సమన్వయం చేసుకుని, వారి సూచనల మేరకు టోకెన్లు జారీ చేస్తామన్నారు. ఎక్కడ్కెనా జన రద్దీని పూర్తిగా అదుపు చేయాల్సిన బాధ్యత జిల్లా ఎస్పీ చేతిలో ఉంటుందన్నారు. భక్తుల తోపులాట అంశంపై జ్యూడిషియల్ ఎంక్వైరీ జరుగుతోందని, న్యాయ విచారణలో పూర్తి విషయాలు వెల్లడవుతా యన్నారు. ఇక, టీటీడీలో సమన్వయం లోపం ఉదంటూ జరుగుతోన్న ప్రచారాన్ని ఈవో శ్యామలరావు కొట్టిపారేశారు. టీటీడీలో సమన్వయ లోపం లేదని స్పష్టం చేసిన ఆయన టీటీడీలో ఛైర్మన్ కీలకం అని ప్రకటించారు. పాలకమండలిలో చర్చించి తీసుకున్న నిర్ణయాలు అమలు చేశాం అన్నారు. అయితే, బైరాగిపట్టెడ లో భక్తులను అనుమతించే సమయంలో ప్రోటోకాల్ మేరకు విధానం పాటించలేదన్నారు. ఛైర్మన్ కి నాకు మధ్య ఎలాంటి విభేదాలు లేవు. ఆరు నెలలుగా ఎన్నో మంచి పనులు చేశాం. వాటిని పక్కన పెట్టేసి తొక్కిసలాట ఘటన పైనే విమర్శలు చేస్తున్నారని టీటీడీ ఈవో శ్యామలరావు ఆవేదన వ్యక్తం చేశారు.తిరుమలలో ప్రతి భక్తుడికి నాణ్యమైన సేవలు అందించేందుకు గత ఆరు నెలలుగా అనేక సంస్కరణలు తీసుకువస్తున్నామని అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. దాతల విభాగాన్ని పూర్తిగా ఆడిట్ చేయించి అర్హులైన దాతలకు సేవలు అందేలా, మధ్యవర్తులను పూర్తిగా నిషేధించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు వసతి ఎవరికి కేయించాలో తెలియని అగమ్య పరిస్థితి నుంచి మరింత పూర్తి పారదర్శకంగా వసతి గదులు కేటాయిస్తున్నామన్నారు. రాబోవు రోజులలో వసతి గదులు కేటాయింపులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భక్తుల వాట్సాప్ కే పూర్తి సమాచారం, రిజిస్ట్రేషన్ చేసే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల భక్తులు ఎక్కువ సేపు వేచియుండకుండా శ్రీవారి దర్శనం కల్పిస్తున్నామని అన్నారు. విచక్షణ కోటాను , మానవ జోక్యాలను తగ్గించి భక్తులకు త్వరితగతిన దర్శనం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి సందర్భంగా తిరుమల శ్రీవారి దర్శనాన్ని అన్ని తరగతుల వారికి భేషుగ్గా ఏర్పాటు చేశామన్నారు.

## పేదరికమే అర్హతగా సంక్షేమ పథకాల అమలు

మొదటి పేజీ తరువాయి...

ప్రతిరోజు ఇలానే ఉండే విధంగా ఆ దేవుడు వారిని దీవించాలన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఈనాటి తెలంగాణ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ఇళ్లు పేదలకు కట్టించి ఇచ్చిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదేనన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇల్లు ఇందిరమ్మ ఇల్లు అంటేనే ఇందిరమ్మ ప్రభుత్వం అని పేర్కొన్నారు. ప్రజలు మార్పు కావాలని తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకొని ఒక సంవత్సరం పూర్తయి రెండో సంవత్సరంలోకి వచ్చామన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏందో ప్రతి తెలంగాణ బిడ్డకు తెలుసని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రాన్ని ఆనాడు పెద్దలు ఎలా కొల్లగొట్టారో తెలుసని అయినా కూడా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఇచ్చిన ప్రతీ హామీని తెలంగాణ బిడ్డకు ఇస్తూ ఎక్కడా తెలంగాణలో పేదవాడు ఇబ్బంది పడొద్దు అని పేదవాడు కుటుంబం ఆనందంగా ఉండాలని తహతహలాడుతూ ఈనాటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లమీద ఈ ప్రభుత్వం ఎంత చిత్త శుద్ధితో ఉందో చెప్పడానికి మొదటి విడతగా మొదటి సంవత్సరంలోనే నాలుగున్నర లక్షల ఇళ్లు రాష్ట్రవ్యాప్తంగా నిర్మించాలని ఒక దృఢ సంకల్పంతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి తక్కువలో తక్కువ 3500 ఇండ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ రాజ్యం ఉన్నంతవరకు సంక్షేమం అనేది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. జనవరి 26 నుంచి పేదలు మెచ్చే మరో నాలుగు సంక్షేమ హామీలు అమలు కాబోతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ ఒకటే చెప్పదలుచుకున్నానని తెలంగాణ రాష్ట్రంలో ఉండే పేద వాడి కల నెరవేర్చడం కోసం అర్హులైన ప్రతీ పేదవాళ్ళకి ఈ ఇందిరమ్మ రాజ్యం రాబోయే నాలుగు సంవత్సరాలలో 20 లక్షల ఇళ్లు కట్టాలని చిత్తశుద్ధితో ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్, ఖమ్మం ఆర్డీఓ, హౌసింగ్ ఈ ఈ, ఇతర అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు తెలంగాణకు పసుపు బోర్డు

మొదటి పేజీ తరువాయి...

ప్రకటించి, పల్లె గంగారెడ్డిని పసుపు బోర్డు ఛైర్మన్‌గా నియమించినట్లు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపి బండి సంజయ్ ప్రయత్నం ఫలించి బోర్డు ఏర్పాటు జరిగింది. గతంలో స్పైసెస్ బోర్డు ఏర్పాటు చేయగా, ప్రత్యేకించి పసుపుబోర్డు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ వచ్చింది. ఈ నిర్ణయంతో తెలంగాణలో పసుపు రైతుల క్రయ, విక్రయాలు, ప్రాసెసింగ్‌కు మరింత ప్రోత్సాహం లభించనుంది. నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రారంభోత్సవం జరగనున్నది. ఈ కార్యక్రమం తెలంగాణకు మరో ప్రాముఖ్యమైన మైలురాయి కానుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల, వ్యవసాయ శాఖల అధికారులు, పశ్చిమ రాష్ట్రాల ఇతర వ్యవసాయ సంబంధిత నాయకులు, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిసింది. ప్రారంభోత్సవం సందర్భంగా పసుపు రైతులకు సంబంధించి వ్యూహాలు, నూతన ప్రాజెక్టులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు, సహాయ కార్యక్రమాలను ప్రకటించే అవకాశం ఉంది. రైతులకు పసుపు విక్రయాలు, మార్కెట్‌కు ఉన్న అవరోధాలు, రుణాల వంటి అంశాలపై పలు ముఖ్యమైన చర్చలు జరగనున్నాయి. పసుపు రైతుల సమస్యలు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు కేంద్రం ఈ బోర్డు స్థాపించనుంది. తెలంగాణ రాష్ట్రంలో పసుపు సాగులో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న నిజామాబాద్, కొమురంభీం ఇతర జిల్లాలలోని రైతులకు ఈ బోర్డు ద్వారా మరింత సాయం అందనుంది. కేంద్ర ప్రభుత్వం పసుపు పంటను ఒక ప్రత్యేకమైన పరిశ్రమగా భావించి, రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ఈ బోర్డు ఏర్పాటును ప్రకటించింది. మరోవైపు పల్లె గంగారెడ్డి రైతు సంక్షేమం కోసం పోరాడిన వ్యక్తి. ఆయన వ్యవసాయ రంగం మీద అవగాహన, పసుపు రైతుల సమస్యలను అర్థం చేసుకోవడంలో అనుభవం ఉన్న వ్యక్తి కావడంతో ఆయన నియామకాన్ని కేంద్రము సమర్థించింది. ఆయన మార్కెట్ ప్రవర్తన, గుణాత్మక అభివృద్ధిపై అనేక మార్గదర్శకాలపై అభిప్రాయం వెల్లడించారు. పసుపు బోర్డు ఏర్పాటు ద్వారా రైతులకు అనేక కొత్త అవకాశాలు రానున్నాయి. రైతులు పసుపు పంటను మరింత మంచి ధరలలో విక్రయించేందుకు మరింత సహాయాన్ని అందుకుంటారు. దీంతోపాటు పసుపు ప్రాసెసింగ్, ఎగుమతుల ప్రోత్సాహం, నూతన టెక్నాలజీలను ఉపయోగించి పంటల ఉత్పత్తి పెంచడం వంటి అంశాలపై రైతులకు మరింత అవగాహన పెరుగుతుంది. ఈ కొత్త బోర్డు ఏర్పాటుతో రైతులకు మంచి అవకాశం దక్కనుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అనేక మంది రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

## నేతల దర్శకత్వంలోనే... కోడి పందాలు

మొదటి పేజీ తరువాయి...

నిర్వహిస్తున్నప్పటికీ పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహిస్తోంది. గతం కంటే భిన్నంగా జిల్లా వ్యాప్తంగా భారీగా పందెం బరుల ఏర్పాటుకు కూటమి నేతలతో పాటు వైసీపీ నేతలు కూడా ఎవరికి తగిన తీరిలో వారు బరుల ఏర్పాటులో రంగంలోకి దిగారు. జిల్లా వ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో బరులు నిర్వహిస్తున్నారు. ఐ.పోలవరం మండలం మురమళ్ల, కాట్రేనికోన మండలం చెయ్యేరు, ముమ్మిడివరం మండలం కొత్తలంకలతో పాటు ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం, అమలాపురం మండలంలోని అనేక ప్రాంతాలతో పాటు రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట, రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో భారీగా పందెం బరులు ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. 216 జాతీయ రహదారిని ఆనుకుని బరులు ఏర్పాటవుతున్నాయి. మరోవైపు సంక్రాంతి సంబరాల పేరిట సెట్టింగులు వేసి ఆ ముసుగులోనే గుండాట, పేకాట, కోడి పందాలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడక్కడా తమ ఉనికిని చాటుకునేందుకు ప్లెక్సీలు పెట్టి ఫొటోలు తీయడం 'షరా మామూళ్ల'గానే మారింది. మరికొన్ని చోట్ల పోలీసు బందోబస్తు నడుమ బరులను ట్రాక్టర్లతో దున్నేస్తున్నట్టు చేస్తున్నప్పటికీ అవి మొక్కుబడిగానే జరుగుతున్నాయి. బరి ఒకచోట ఉంటే మరోచోట ట్రాక్టర్‌తో దున్నే పనులు చేయడం కనిపిస్తోంది. ఈ సారి మురమళ్లలో భారీ ఏర్పాట్ల నడుమ కోడిపందాలు నిర్వహించడానికి వీఐపీ బరిని సిద్ధం చేస్తున్నారు. కోడిపందాల బరుల వద్ద కొన్నిచోట్ల ఇప్పటికే బెల్టుషాపులు పబ్లిక్‌గా వెలిశాయి. నిబంధనకు విరుద్ధంగా బహిరంగ లిక్కర్ విక్రయాలు పందెం బరుల వద్ద చేయడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పోలీసు యంత్రాంగం కనుసన్నల్లోనే బరులు ఏర్పాటయ్యే విధంగా కూటమి నాయకులు, పోలీసులతో మంతనాలు జరుపుతున్నారు. కొన్నిచోట్ల ప్రజాప్రతినిధులకు ఇష్టం లేకుండా బరులు వేస్తుంటే వాటిని పోలీసులు అడ్డుకునే విధంగా వ్యూహాలు రూపొందించారు.

## ప్రధాని మోడీ వల్లే... శాంతి భద్రతలు సాధ్యమైంది

శ్రీనగర్ జనవరి 13(నిఘా న్యూస్): జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లుగానే ప్రధాని మోడీ విజయవంతంగా ఎన్నికలు నిర్వహించారని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీని కొనియాడారు. మోదీ మూడోసారి ప్రధానిగా అధికారం చేపట్టిన తర్వాత శ్రీనగర్‌లో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. అప్పుడే కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రజలకు వాగ్దానం చేశారని అన్నారు. అన్నట్లుగానే నాలుగు నెలలలోపు జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యిందని పేర్కొన్నారు. దాని ఫలితంగానే నేడు తాను ముఖ్యమంత్రి పదవిలో ఉన్నానన్నారు. జమ్మూ కశ్మీర్ ఎన్నికల్లో అన్ని ప్రాంతాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారని, ఎక్కడా రిగ్గింగ్, అధికార దుర్వినియోగం జరిగినట్లు ఫిర్యాదులు లేవని పేర్కొన్నారు. అదే విధంగా జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తానని ఇచ్చిన హామీని ప్రధాని త్వరలో నెరవేరుస్తారని నమ్ముతున్నానని అన్నారు. మళ్లీ భారత దేశంలోని ఒక రాష్ట్రంగా జమ్మూకశ్మీర్ అవతరిస్తుందని అన్నారు. ప్రధాని మోదీ కృషి వల్ల సరిహద్దుల్లో శాంతిభద్రతలు కొలిక్కి వచ్చాయని ఒమర్ అన్నారు. పర్యటకపరంగా కూడా కశ్మీర్ అభివృద్ధి చెందుతోందని తెలిపారు. శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై సోన్‌మార్గ్ ప్రాంతంలో నిర్మితమైన జడ్-మోడ్ సొరంగాన్ని నేడు ప్రధాని మోదీ ప్రారంభించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సొరంగం ప్రారంభంతో ఎగువ ప్రాంతాల ప్రజలు ఇకపై మైదాన ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని. ఏడాదిలో ఏ సీజన్‌లోన్కెనా లద్దాఖ్‌ను రహదారి మార్గం ద్వారా చేరుకోవడానికి వీలవుతుందని అన్నారు. దీనివల్ల సోన్‌మార్గ్‌కు పర్యటకుల రాక కూడా పెరగనుందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో జమ్మూకశ్మీర్‌లో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోదీ అక్కడి ప్రజల అభివృద్ధి కోసం పాటుపడతానని హామీ ఇచ్చారు. జమ్మూకశ్మీర్‌ను మళ్లీ రాష్ట్రంగా మారుస్తామని అన్నారు. కశ్మీర్ యువత చేతిలో రాళ్లను వదిలేసి విద్య, అభివృద్ధి వైపు వెళ్లాలని ఎదురు చూస్తున్నారని అన్నారు.

## ప్రగతి భవన్‌కు వస్తానంటున్న హరీష్

మొదటి పేజీ తరువాయి...

కాలేదన్నారు. ముఖ్య మంత్రి ఇచ్చిన చెక్ డమ్మీ చెక్కును ప్రదర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు డమ్మీ హామీలు ఇచ్చినట్లు చెక్కులు కూడా డమ్మి ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతు పండించిన పంటకు ఇస్తామన్న బోనస్ కూడా ఇవ్వడం లేదని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అని ఒక పేరు పెట్టారు. దీని ద్వారా వ్యవసాయ కూలీలకి 12 వేలు ఇస్తామన్నారు. ఎవరు వ్యవసాయ కూలీలు. ఎలా గుర్తిస్తారో తెలుపటం లేదని పేర్కొన్నారు. ఎకరం భూమి ఉన్న అందరికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రైతు కూలీలకు 12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క అబద్దాలు మాట్లాడడంలో గోబెల్స్ ను మించిపోయాడన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా పర్యటనలో పచ్చి అబద్దాలు మాట్లాడారన్నారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వం లో పడావు పడ్డ భూముల్లో పచ్చని పంటలు పండించామన్నారు. ఆరు లక్షల ఎకరాల్లో మేము పంటలకు అందించామన్నారు.ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదు,ఒక్క ప్రాజెక్టు కట్టలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. భట్టి చర్చకు సిద్దామా అని సవాల్ విసిరారు.ఖమ్మం రమ్మంటారా,మీరు ఉంటున్న ప్రగతి భవన్ కు రమ్మంటే వస్తానన్నారు.ఒకవేళ నేను చెప్పేది అబద్ధం అయితే రాజీనామాకు సిద్ధంగా ఉండాలన్నారు. లేదా రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జాహిరాబాద్ ఎమ్మెల్యే మానిక్ రావ్, డి సి సి భి చేర్మెన్ శివకుమార్ నాయకులు జైపాల్ రెడ్డి, విజేందర్ రెడ్డి జీవి శ్రీనివాస్, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

# గాలి పటాలను ఎగరేసిన ఉప్పల్ ఎమ్మెల్యే




**మల్లాపూర్, జనవరి 13 (నిఘా న్యూస్):** మల్లాపూర్ జిహెచ్ఎంసి గ్రౌండ్ లో భోగి పండుగను పురస్కరించుకుని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు పన్నాల దేవేందర్ రెడ్డి, ప్రభుదాసుతో కలిసి ఉత్సాహంగా సంబరంగా గాలిపటాలు ఎగరవేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం తన చిన్ననాటి జ్ఞాపకాలను వారు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని, పతంగులను ఎగిరేవేసేటప్పుడు చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేత



**బాలాపూర్, జనవరి 13 (నిఘా న్యూస్):** మీర్పేట్ పరిధిలోని 33 వ డివిజన్ భాగ్య కళానగర్ సహకార సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు డివిజన్లోని మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులు వేసి తమ ప్రతిభను చాటారు. పోటీలకు జడ్జిలుగా పాల్గొన్న అంగన్వాడి టీచర్లు ఆకర్షణీయమైన ముగ్గులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు సంక్రాంతి పండుగ విశిష్టతను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బత్తిని గణేష్, జి.వెంకటరమణ, రామకృష్ణ, టి.యాదగిరి, బొల్లెపోగు కుమార్, డి.భాస్కర్, ఈ పాండు, కంబాలపల్లి గణేష్, కె యశ్వంత్, మోహన్ నాయక్, రాజు, కాలనీ పెద్దలు సిహెచ్ యాదయ్య జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో నటరాజ స్వామికి అభిషేకం



**శ్రీకాళహస్తి, జనవరి 13 (నిఘా న్యూస్):** దక్షిణ కాశీగా ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వర దేవస్థాన ఆలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం నటరాజ స్వామికి శివకామ సుందరి మాణిక్య వాసులకు అభిషేకాలు నిర్వహించారు. ముందుగా కలస్థాపన గణపతి పూజ పుణ్యా వచనము కలిశానికి పుష్పాలతో పూజలు చేసి నటరాజ స్వామికి పాలు పెరుగు తేనె సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి అనంతరం స్వామివారిని చక్కగా పూలమాలతో సుందరంగా అలంకరించి ఆపై దీప దూప నైవేద్యం అఖండ దీపారాధన కర్పూర హారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి ఏఈఓ కృష్ణారెడ్డి భక్తులు పాల్గొన్నారు.

# శంషాబాద్ ఆరోగ్య కేంద్రంలో సంక్రాంతి ముగ్గులు




**శంషాబాద్, జనవరి 13 (నిఘా న్యూస్):** శంషాబాద్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గ లత సంక్రాంతి పర్వదినం ను పురస్కరించుకుని ఆరోగ్య కేంద్రాన్ని కార్మికులతో ప్రత్యేకంగా శుభ్రం చేయించి, ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆసుపత్రి డాక్టర్లతో, వైద్య సిబ్బందితో కలిసి రంగురంగుల ముగ్గులు వేశారు. ఆరోగ్య కేంద్రానికి సందర్శించిన ప్రజలు ఆరోగ్య కేంద్రంలో సైతం పండుగ వాతావరణం నెలకొందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గలత మాట్లాడుతూ పండుగలు సంస్కృతి సంప్రదాయాలను గుర్తుచేస్తాయని పేర్కొన్నారు.

# బడంగ్పేట్ బీజేపీ కమిటీలకు అధ్యక్షుల నియామకం

## బిజెపి నేత చెరుకుపల్లి వెంకటరెడ్డి



**బాలాపూర్, జనవరి 13 (నిఘా న్యూస్):** భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికల పర్వంలో భాగంగా బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ను రెండు కమిటీలు గా విభజించి బీజేపీ పార్టీ అధ్యక్షులను నియమించారు. రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి, వీర కర్ణ రెడ్డిలను అధ్యక్షులుగా, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా జూరాల ప్రభాకర్, జి.శివారెడ్డి లను నియమిస్తూ జిల్లా పార్టీ ప్రకటన జారీ చేసిందని తాజా మాజీ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి తెలియజేశారు. నూతనంగా నియమించిన అధ్యక్షులను నాదర్గుల్ పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్పొరేషన్ లో పార్టీని తిరుగులేని శక్తిగా ఎదిగేందుకు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చెరుకుపల్లి వెంకటరెడ్డి మాట్లాడుతూ తాను గత సంవత్సరాలుగా పార్టీ అప్పగించిన అధ్యక్ష బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించానని, పార్టీ ఏ పని అప్పగించినా తన వంతు కృషి చేశానని, అధ్యక్ష బాధ్యతలు ఎంతో సంతృప్తి నిచ్చాయని అన్నారు. తన పదవీ కాలంలో కార్పొరేషన్ ఎన్నికలలో పది స్థానాలలో విజయం, సహకార బ్యాంక్ ఎన్నికలలో బాలాపూర్, నాదర్గుల్ బ్యాంకులలో గతంలో కంటే ఎక్కువ డైరెక్టర్ స్థానాల విజయం, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో బడంగ్ పేట్ కార్పొరేషన్ లో ఎక్కువ ఓట్లు రావడానికి, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలలో పార్టీ అభ్యర్థి విషయంలో కీలక భూమిక, అసెంబ్లీ ఎన్నికలలో అధికార పార్టీకి సమానంగా ఓట్ల శాతం, పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థి విజయంలో తిరుగులేని మెజార్టీ సాధించడంలో కార్పొరేషన్ ప్రజలు, ఓటర్లు, పార్టీ కార్యకర్తలు నాయకులు తనకు పూర్తిగా సహకరించారని, వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు నడికుడి యాదగిరి, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు ఏనుగు రామిరెడ్డి, రామిడి శూరకర్ణ రెడ్డి, నరసింహారెడ్డి, నవారు శ్రీనివాస్ రెడ్డి, బంగారు ప్రభాకర్, గౌర శ్రీనివాస్, ఈరెంకి వేణు గౌడ్, జక్కిడి మధుసూదన్ రెడ్డి, పెత్తుల పుల్లారెడ్డి, నిమ్మల రవికాంత్ గౌడ్, తోట ప్రతాపరెడ్డి, చేకూరి రాము, శివరాంరెడ్డి, ఆర్ శ్రీధర్, రవితేజ మహిళా నాయకురాళ్ళు నివేదిత, మీనాక్షి, బాలామణి, పోలింగ్ బూత్ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### భూమిలేని వ్యవసాయ..

# కార్మికులందరికి 12 వేల రూపాయలు ఇవ్వాలి

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సిర్పంగి స్వామి



**వలిగొండ, జనవరి 13 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ తమ ఎన్నికల వాగ్దానంలో భూమిలేని వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తానన్న ప్రభుత్వ హామీని జాబ్ కార్డులతో సంబంధం లేకుండా అందరికి ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేసారు. సోమవారం పులిగిల్ల గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ భూమిలేని ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికి ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే 12 వేల రూపాయలు ఇవ్వాలని జాబ్ కార్డులతో లింక్ పెట్టకుండా భూమి లేని పేదలందరికి ఈ పథకాన్ని వర్తింప జేయాలని లబ్ధిదారులను గ్రామ సభల ద్వారా ఎంపికజేయాలని వలస కార్మికులకు, కూలీ పని చేసుకుని బతికే పేదలందరిని అర్హులుగా ఎంపిక చేయాలని వారు సూచించారు. జాబు కార్డు ఆధారంగా లబ్ధిదారులను గుర్తిస్తామంటే చాలామందికి వివిధ కారణాల చేత జాబు కార్డు లేని పరిస్థితి ఉన్నదని దాని ఆధారంగానే లబ్ధిదారులను ఎంపిక చేయడం అనేది సరికాదని ఈ ఆలోచనను ప్రభుత్వం తక్షణమే స్వస్తి చెప్పి గ్రామసభలు నిర్వహించి భూమిలేని ప్రతి కూలీని, పేదలను ఈ స్కీంకు ఎంపిక చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి, మండల ఉపాధ్యక్షులు వేముల అమరేందర్, నాయకులు వేముల రాములు, ముత్తయ్య, టేల్దుర్కర్, నరేష్ సురేష్,బొడ్డు మధు,మౌనిక,లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవకే అంకితమైన ముద్దసాని

## సంతాప సభలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి



**వలిగొండ, జనవరి 13 (నిఘా న్యూస్):** వలిగొండ మండలం మొగిలిపాక గ్రామం ముద్దసాని నరసింహారెడ్డి చిన్ననాటి నుండి ప్రజాసేవకే అంకితమై తన జీవితాంతం కృషి చేశాడని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మొగిలి పాకలో ముద్దసాని నరసింహారెడ్డి సంతాప సభ మామిడి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది. సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని కంచర్ల మాట్లాడుతూ ప్రజల కోసం నిత్యం పాటుపడిన వ్యక్తి అని ప్రశంసించారు. గ్రామంలో ఏ ఒక్క కుటుంబానికి ఏ ఒక వ్యక్తికి ఇబ్బంది అయినా సేవ చేసిన వ్యక్తి అని ఆయన కొనియాడారు. ప్రజల కోసం పని చేసిన నరసింహారెడ్డికి సభకు ముందు రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగింది. మొగిలి పాకలో చిరస్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచినగొప్ప వ్యక్తి విగ్రహం పెట్టాలని సభలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంతాప సభ నిర్వాహకులు ముదసాని శ్రీనివాస్ రెడ్డి, మామిడి సత్తిరెడ్డి, పబ్బు ఎల్లయ్య, గౌడ్, బిజెపి రాష్ట్ర నాయకులు మర్రి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి సిపిఐఎం మండల నాయకులు మోగిలిపాక గోపాల్, బిజెపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు రాచకొండ కృష్ణ నరసింహారెడ్డి కుమారులు ముద్దసాని నరోత్తం రెడ్డి, దుర్గారెడ్డి పులిపలుపుల రాములు మాజీ సర్పంచులుజక్క గణేష్ రెడ్డి జక్కుల శంకరయ్య మాజీ ఎంపీటీసీ శ్రీలత రమేష్, సామఇంద్రారెడ్డి, మొగిలి పాక పాపయ్య, నరేంద్ర చారి, నాయకులు యాస అంజిరెడ్డి నిషాకర్ రెడ్డి మహంకాళి సిద్దయ్య గంట బిక్షపతి మచ్చ మల్లేశం, మాజీ అధ్యక్షులు మర్ల మల్లేశం, వెంకన్న, సింగల్ విండో మాజీ డైరెక్టర్ జక్క నరసింహారెడ్డి, జడిగే నరసింహ, మచ్చ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# పండగ పూట ఇంటింటికి సిపిఐ(ఎం)

## సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం



**వైరా, జనవరి 13 (నిఘా న్యూస్):** ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం మున్సిపాలిటీ పరిధిలో పేదలకు వర్తింప చేయాలని, పేదలందరికీ జాబ్ కార్డులు ఇచ్చి 12 వేల రూపాయలు ఇవ్వాలని సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని రేచర్ల బజార్ నందు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ, స్థానిక సమస్యలను తెలుసుకుంటూ ఇంటింటికీ సిపిఐ(ఎం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఐ(ఎం) పార్టీని ఆదరించాలని, భవిష్యత్ పోరాటాలు సహకరించాలని, సమిష్టిగా పోరాడితేనే ప్రజలు సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించకపోతే మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు వేల పేద కుటుంబాలకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం మున్సిపాలిటీలోని పేదలందరికీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, పట్టణ కమిటీ సభ్యులు గుడిమెట్ల మోహన్ రావు, గుడిమెట్ల రజిత, కొంగర సుధాకర్, గుమ్మ నరసింహారావు, మాడపాటి మల్లికార్జున్, మాడపాటి వెంకటీ, అమరనేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నర్వ మండలంలో క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎస్సై



**నారాయణపేట, జనవరి 13 (నిఘా న్యూస్):** నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలోని పాతర్ చెడు గ్రామంలో గ్రామ యువకులు ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలను నర్వ ఎస్సై కుర్మయ్య క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులకు టీ షర్టులను అందించి క్రీడాకారులను పరిచయం చేసుకుని కొద్దిసేపు బ్యాటింగ్, బౌలింగ్ చేసి అందరినీ ఉల్లాసపరిచారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత పండుగ రోజు అందరూ కలిసిమెలిసి క్రీడలు ఆడడం వల్ల ఎంతో ఆనందంగా ఉంటుంది. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చు అని తెలిపారు. యువకులు, విద్యార్థులు చిన్నతనం నుండే క్రీడలపై మక్కువ చూపాలని తెలిపారు. ఆటలో గెలుపోటములు సహజమని ఓడిపోయిన వారు బాధపడకుండా మళ్ళీ ప్రయత్నించి గెలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు మహేష్, కర్ణకర్ రెడ్డి, రాజు గౌడ్, పిటి మాస్టర్ గ్రామ పెద్దలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యంనంపేటలో.. గోదాదేవి రంగనాయక స్వామి కళ్యాణం

## హాజరైన మాజీ మంత్రి ఎమ్మెల్యే మల్లారెడ్డి



**ఘట్ కేసర్, జనవరి 13 (నిఘా న్యూస్):** పోచారం మున్సిపల్ పరిధిలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ గోదాదేవి కళ్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. కళ్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని గోదాదేవి రంగనాయక స్వామి ఆశీస్సులకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై శ్రీ గోదాదేవి రంగనాయక స్వాముల ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యా నాయక్, కౌన్సిలర్లు నర్రి ధనలక్ష్మి కాశయ్య, సింగిరెడ్డి సాయిరెడ్డి సుర్వి రవీందర్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ నర్రి మంజుల శ్రీశైలం, ఈవో భాగ్యలక్ష్మి మాజీ చైర్మన్ రాజేష్ గౌడ్, నాయకులు బద్దం జగన్మోహన్ రెడ్డి, ఆకటి బాల్ రెడ్డి, శ్రీలత, సత్యనారాయణ, శ్రీకాంత్, పోశెట్టి నాగార్జున, బొక్క బుచ్చిరెడ్డి, రామకృష్ణ చారి తదితరులు పాల్గొన్నారు



నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలోని కృష్ణ చెక్పోస్ట్ దగ్గర కర్ణాటక తెలంగాణ బార్డర్ పై రాకపోక వాహనాలను జల్లెడ పడుతున్న పోలీసులు ఏ ఒక్క వాహనాన్ని వదలకుండగా తనిఖీ నిర్వహిస్తున్నారు. ప్రవీణ్ కుమార్ తోపాటు పలువురు పోలీసులు ఉన్నారు.

*-నారాయణపేట, జనవరి 13 (నిఘా న్యూస్):*

# మున్సిపల్ సిబ్బందికి వస్త్రాల బహుకరణ

## బిఆర్ఎస్ నాయకులు అబ్బావతి నరసింహ



**ఘట్ కేసర్, జనవరి 13 (నిఘా న్యూస్):** సిబ్బందే నా దేవుళ్ళు, వాళ్లు సంతోషంగా ఉంటే నా అవార్డు పరిశుభ్రంగా ఉంటుందని బిఆర్ఎస్ పార్టీ నాయకులు అబ్బావతి నరసింహ అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి గ్రామంలోని 15వ వార్డులో ఆయన ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా 30 మంది మున్సిపల్ సిబ్బందికి నూతన వస్త్రాలు, ఒక్కొక్కరికి 500 రూపాయలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా వార్డులో పనిచేసే సిబ్బంది సంక్రాంతి పండుగ సందర్భంగా సంతోషంగా ఉండాలని ఉద్దేశంతో అందజేయడం జరిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సరితా, బృందావన కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# చైనా మాంజలను వాడకండి

## నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కామోజీ



**బాలాపూర్, జనవరి 13 (నిఘా న్యూస్):** సంక్రాంతి వచ్చిందంటే రంగురంగుల ముగ్గులతోపాటు, పిల్లలు, పెద్దలు గాలిపటాలు ఎగురవేసి పండుగను ఉత్సాహంగా జరుపుకుంటారని, ఈ క్రమంలో భూతంలా ప్రవేశించిన చైనా మాంజాతో ప్రజలు అప్రమత్తంగా ఉండి సంక్రాంతి పండుగను ఉత్సాహంగా జరుపుకోవాలని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కామోజీ తిరుపతయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, యువకులు పోటా పోటీగా పతంగులు ఎగురవేస్తూ, ఒకరి పతంగి కన్నా మరొకరి పతంగి ఎక్కువ ఎత్తుకు ఎగురవేయాలని, ఈ క్రమంలో గాలిలోనే ఇతరుల పతంగులను తెంపివేయాలని చైనా మాంజాను వాడుతున్నారని, హానికారకమైన, ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను వాడకూడదని ఆయన తెలిపారు. ముఖ్యంగా పక్షులతో పాటు, కొన్ని సందర్భాలలో వాహనదారుల మృతికి చైనా మాంజాలు కారణమవుతున్నాయని అన్నారు. చిన్న పిల్లలు, యువత కరెంటు వైర్లు, బిల్డింగులపై జాగ్రత్తలు పాటిస్తూ కైట్ ఫెస్టివల్ ను ఆనందంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

# తుక్కుగూడ మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలిగా హేమలత



**పహాడీషరీఫ్, జనవరి 13 (నిఘా న్యూస్):** భారతీయ జనతా పార్టీ తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షురాలుగా తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్ పర్సన్ బరిగెల హేమలత గౌడ్ ను బిజెపి నియమించింది. ఈ సందర్భంగా హేమలత గౌడ్ మాట్లాడుతూ నా పై నమ్మకంతో పార్టీ ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని, పార్టీ అభివృద్ధికై మరింత కష్టపడి పనిచేస్తానని తెలిపారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నరసింహారెడ్డికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ కి, తుక్కుగూడ మున్సిపల్ మాజీ అధ్యక్షులకు, కౌన్సిలర్లకు, సీనియర్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

# యంనంపేటలో.. గోదాదేవి రంగనాయక స్వామి కళ్యాణం

### హాజరైన మాజీ మంత్రి ఎమ్మెల్యే మల్లారెడ్డి



**ఘట్ కేసర్, జనవరి 13 (నిఘా న్యూస్):** పోచారం మున్సిపల్ పరిధిలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ గోదాదేవి కళ్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. కళ్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని గోదాదేవి రంగనాయక స్వామి ఆశీస్సులకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై శ్రీ గోదాదేవి రంగనాయక స్వాముల ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యా నాయక్, కౌన్సిలర్లు నర్రి ధనలక్ష్మి కాశయ్య, సింగిరెడ్డి సాయిరెడ్డి సుర్వి రవీందర్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ నర్రి మంజుల శ్రీశైలం, ఈవో భాగ్యలక్ష్మి మాజీ చైర్మన్ రాజేష్ గౌడ్, నాయకులు బద్దం జగన్మోహన్ రెడ్డి, ఆకటి బాల్ రెడ్డి, శ్రీలత, సత్యనారాయణ, శ్రీకాంత్, పోశెట్టి నాగార్జున, బొక్క బుచ్చిరెడ్డి, రామకృష్ణ చారి తదితరులు పాల్గొన్నారు

# వైభవంగా శ్రీ రంగనాథ గోదాదేవి కళ్యాణం



**అంబర్ పేట, జనవరి 13 (నిఘా న్యూస్):** అంబర్ పేట చే నెంబర్ లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో సోమవారం శ్రీ రంగనాథ గోదా కళ్యాణ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. గత నెల 16వ తేదీన దేవాలయంలో ధనుర్మాస విశేష పూజలు ప్రారంభమయ్యాయి. ఈ పూజాధి కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు కలకోట నరసింహాచార్యులు నేతృత్వంలో శ్రీ రంగనాథ గోదా కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం ఆలయ పురోహితులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ శాశ్వత ధర్మకర్త రావి కమలాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బాకరాజు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కదురు, శివరామకృష్ణ, కోశాధికారి పొడుగు సత్యనారాయణ నేత, సంయుక్త కార్యదర్శి రంగాపురం యాదగిరి గౌడ్, సభ్యులు నూనె ముంతల అంజయ్య గౌడ్, ముక్కర్ల మోహన్ యాదవ్, కుంట బాలనర్సు గంగపుత్రల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలలో టీ.సతీష్, నర్సింగ్ రావు, పూర్ణచందర్, శ్రీనివాస్ గుప్తా,రావి అమల, విశాలి, రోహిణి, శారద, చేతన, జ్యోతి, లావణ్య, సౌజన్య సుబ్బలక్ష్మి, సుమలక్ష్మి, ప్రసన్న, భారతి, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**పెబ్బేరు, జనవరి 13 (నిఘా న్యూస్):** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం నందు యూత్ కాంగ్రెస్, కాలనీ యువకుల ఆధ్వర్యంలో మహిళమానులకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగిందని అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయి రెడ్డి తెలిపారు. మొదటి బహుమతి రంగం నరసింహ్మా, రెండవ బహుమతి రాజేష్, మూడవ బహుమతి జై కిసాన్ ఫర్టిలైజ్, స్పాన్సర్స్ గా ముందుకు వచ్చారని తెలిపారు.దీనితో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సహక బహుమతులు అందజేశారు.మొదటి బహుమతి జ్యోతి శరణ్య,మహిళా గెలుచుకోగా,రెండవ బహుమతి గాయత్రి, లక్ష్మి మూడవ బహుమతి సింధూర, సిరి నాలుగవ బహుమతి సంధ్య, సరిత ముగ్గుల పోటీలో బహుమతులు గెలుచుకున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములు యాదవ్,నర్సింహ్మా, గోపాల్,కాలనీ యువత పాల్గొన్నారు.

# నల్లకుంట బిజెపి అధ్యక్షుడిగా ప్రశాంత్ జోషి నియామకం



**నల్లకుంట, జనవరి 13 (నిఘా న్యూస్):** నల్లకుంట డివిజన్ భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నాయకుడు కె.ప్రశాంత్ జోషి నియమితుల య్యారు. ఈ మేరకు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా రిటర్నింగ్ అధికారి శ్రీకాంత్ జోగ్రిగల, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పందిర్ల ప్రసాద్, చిట్టి శ్రీధర్ లు అధికారికంగా ప్రశాంత్ జోషి అధికారికంగా ధ్రువీకరిస్తూ ప్రకటన విడుదల చేశారు. డివిజన్ లోని ఓల్డ్ రామాలయం ప్రాంతానికి చెందిన ప్రశాంత్ జోషి డివిజన్ యువ మోర్చా ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, హైదరాబాద్ జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షుడిగా, అధికార ప్రతినిధిగా పదవి బాధ్యతలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ జోషి మాట్లాడుతూ నల్లకుంట డివిజన్ లో పార్టీని మరింతగా బలోపేతం చేసే దిశగా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. డివిజన్ పార్టీలోని అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలతో కలిసి సమన్వయంతో పని చేస్తానని పేర్కొన్నారు.

# వెలుగ్గుట్టపై కురుమల బోనాలు





**వెలుగ్గుట్ట, జనవరి 13 (నిఘా న్యూస్):** సంక్రాంతి సందర్భంగా ఉప్పల్ కురుమ సంఘం ఆధ్వర్యంలో వెలుగు గుట్ట శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామికి వెలుగ్గుట్ట ఎల్లమ్మ అమ్మవారికి ఘనంగా బోనాలు నివేదించిన కురుమలు. ప్రముఖ ఒగ్గు కళాకారుడు ఒగ్గు శ్రీకాంత్ కురుమ బృదం ఒగ్గుకథ చెప్పారు. గుడి ముందు పెద్ద పట్నం వేశారు. కురుమలు సంక్రాత్రికి ఐలేను, కొమురెల్లి మల్లన్నకు బోనాలు చేసిన మాదిరిగా వెలుగుట్ట పైన బోనాల జాతరను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు గొరిగె కృష్ణ కురుమ రాష్ట్ర కురుమ సంఘం కార్యదర్శి గొరిగే మల్లేష్ కురుమ ఉప్పల్ జోన్ ఉపాధ్యక్షులు గొరిగె పెద్ద మల్లేష్ కురుమ ఉప్పల్ కురుమ సంఘం అధ్యక్షులు చిందం వెంకటేష్ కురుమ వర్కింగ్ ప్రెసిడెంట్ బర్ల కృష్ణ కురుమ సలహాదారులు వెలుగు గుట్ట దేవస్థానం చైర్మన్ జన్ని రఘు కురుమ డైరెక్టర్స్ సోము జంగయ్య సోము బాలమణి, గొరిగే ఐలయ్య కురుమ ఉపాధ్యక్షులు గొరిగే బాల మహేష్ చంద్ర కురుమ ప్రధాన కార్యదర్శి ఎర్ర శ్రీనివాస్ కురుమ ప్రచార కార్యదర్శి కర్రె శ్రీనివాస్ కురుమ కోశాధికారి శాగ పెంటయ్య కురుమ సహాయ కార్యదర్శి కోశిక సత్యనారాయణ కురుమ మహిళా అధ్యక్షురాలు బట్కీరి మంజుల కురుమ బండారు మంజుల కురుమ ముత్యంగారి లత కురుమ కేమిడి ఇందిర కురుమ గొరిగె నాగమణి కురుమ యువత అధ్యక్షులు ముత్యంగారి రాకేష్ కురుమ సలహాదారులు గొరిగె ఐలేష్ కురుమ కర్రె రాజు కురుమ తదితరులు వందలాది కురుమలు భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

# మందా జగన్నాథంకు బిఆర్ఎస్ నేతల నివాళులు



**పెబ్బేరు, జనవరి 13 (నిఘా న్యూస్):** తెలంగాణ ఉద్యమకారుడిగా మందా జగన్నాథం పోషించిన పాత్ర మరువలేనిదని, ఆయన మరణం తెలంగాణకు తీరని లోటు అని పెబ్బేరు మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా పెబ్బేరు పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మండల నాయకులు మాట్లాడుతూ నాగర్ కర్నూల్ మాజీ పార్లమెంట్ సభ్యులు మంద జగన్నాథం మరణం బాధాకరం అని తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతో పాటు రాష్ట్రంలోని అణగారిన వర్గాల అభివృద్ధి కోసం మందా జగన్నాథం ఎనలేని కృషి చేశారని,వారి అకాల మరణం రాష్ట్ర రాజకీయాలకు తీరని లోటని అన్నారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు గా ఉండి ఎంతో అభివృద్ధి చేసారని మాజీ ఎంపీ డాక్టర్ మందా జగన్నాథం బడుగు బలహీన వర్గాలకు ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయన వల్ల ఎంతో మంది రాజకీయంగా కూడా ఎదిగారని గుర్తు చేశారు.వారి అకాల మరణం దురదృష్టకరమని, మంద జగన్నాథం ఆత్మకు శాంతి చేకూరాలని వారు కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వనం రాములు, పట్టణ అధ్యక్షులు దిలీప్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రె స్వామి,కౌన్సిలర్లు మేకల ఎల్లయ్య, గోపిబాబు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విశ్వరూపం, రాజశేఖర్, ఎద్దుల సాయినాథ్, సోషల్ మీడియా కన్వీనర్ వడ్డె రమేష్ బాలస్వామి సందీప్, వెంకటయ్య, సురేష్,అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి



### ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు

**వలిగొండ, జనవరి 13 (నిఘా న్యూస్):** వలిగొండ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ స్థాయి క్రీడలను ప్రోత్సహించి గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను ఎంపిక చేసి ఉన్నత స్థాయి క్రీడలకు ఎదిగే విధంగా ప్రోత్సహించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు అన్నారు. సోమవారం వలిగొండ మండలం పులిగిల్ల గ్రామంలో సంక్రాంతి క్రీడోత్సవాల సందర్భంగా వాలీబాల్ టోర్నమెంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం పేరుకు గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి కనీసం క్రీడా సామాగ్రిని అట్టి మైదానాలలో ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమైందని, కోట్ల రూపాయలు క్రీడా మైదానాల పేరుతో ఖర్చుచేసి గ్రామీణ స్థాయి యువతకు ఉపయోగం లేకుండా పోయిందని వారు అన్నారు. గ్రామాల్లో అనేకమంది నైపుణ్యం కలిగిన యువత ఉన్నారు. వారికి గత ప్రభుత్వం నుంచి కనీసం ప్రోత్సాహం లేక వెనుకపడ్డారు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ స్థాయి యువతను క్రీడలకు ప్రోత్సహించాలని వారు డిమాండ్ చేశారు. వీరితోపాటు సిర్పంగి స్వామి కొమ్మిడి లక్ష్మారెడ్డి జక్క వెంకట్ రెడ్డి కళ్లెం సుదర్శన్ రెడ్డి వాకిటి వెంకటరెడ్డి బుగ్గ చంద్రమౌళి మారబోయిన నరసింహ పైళ్ళ రవీందర్ రెడ్డి కోలన్ రామ్ రెడ్డి బండారి ఎల్లయ్య వరికప్పల సతీష్ వడ్డేమను మధు రవి బుగ్గ వినోద్ వేముల జైపాల్ వేముల జ్యోతిబసు బుగ్గ ఉదయ్ మరబోయిన ప్రశాంత్ సతీష్ ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఎంపివి వైరస్ ఆందోళనకరం కాదు

### డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ జావీద్ అహ్మద్



**అమీర్ పేట్, జనవరి 13 (నిఘా న్యూస్):** హ్యూమన్ మటాపనేమో వైరస్ తో (హెచ్.ఎమ్.పి.వి) భయపడవలసిన అవసరం లేదని, ఆరోగ్య జాగ్రత్తలు మాత్రం పాటించవలసి ఉంటుందని డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ జావీద్ అహమ్మద్ వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని అమీర్ పేట్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రావుఫ్, ఆర్.ఎం.ఓ డాక్టర్ వినాయక్ రావు ఆధ్వర్యంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. సీజనల్ వ్యాధులు సంక్రమించే కాలంలో ఈ వైరస్ ఒకటని స్పష్టం చేశారు. ఈ వైరస్ చలికాలంలో సాధారణంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని తెలిపారు. జలుబు, దగ్గు, జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్లను సంప్రదించడం ఉత్తమమైన మార్గమని సూచించారు. పైన సూచించిన లక్షణాలను నిర్లక్ష్యం వహిస్తే అధికంగా చిన్నారులలో, వృద్ధులలో ఈ వైరస్ సోకే అవకాశాలు అధికంగా ఉంటాయని అన్నారు. నిర్లక్ష్యం చేస్తే ఊపిరితిత్తుల్లోకి ఈ వైరస్ సోకే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఊపిరితిత్తుల్లోకి వైరస్ సోకితే ఆస్పత్రిలో భర్తీ చేసుకొని వైద్య సేవలు అందించి, వైరస్ ప్రభావాన్ని పూర్తిగా తగ్గించడం జరుగుతుందని ప్రజలకు భరోసా కల్పించారు. ఈ వైరస్ అధికంగా ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులకు, శ్వాసకోశ అనారోగ్యం, మూత్రపిండాల వ్యాధిగ్రస్తులకు, గుండె అనారోగ్య సమస్యలు ఉన్న వారిలో ఈ వైరస్ ప్రభావం చూపుతోందని గుర్తు చేశారు. చిన్నారులకు చలికాలంలో ఫ్లూ వ్యాక్సిన్ ఇప్పించాలని సూచించారు. దీంతో ఈ వైరస్ ప్రభావం ఉండదని విశ్వాసం కల్పించారు. రోగ నిరోధక శక్తి ఉన్నవారిలో ఈ వైరస్ దరిచేరదని స్పష్టంగా వివరించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమావళిలో భాగంగా పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం, రోజుకు 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం, వారంలో ఐదు రోజులైనా వ్యాయామం చేయాలని పునరుద్ఘాటించారు. సమయానుసారంగా నిద్ర చేయడం అలవాటు చేసుకోవాలని కోరారు. ఒత్తిడిని జయించాలని సూచించారు. పైన సూచించిన ఆరోగ్య నియమావళిని పాటిస్తే శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ప్రజలకు భరోసా కల్పించారు. తద్వారా వైరస్ ల ప్రభావం ఏమాత్రం కలగదని ప్రజలకు భరోసా కల్పించారు. అందరూ ఆరోగ్య నియమావళి పాటించి, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని ఆకాంక్షించారు.



మల్లాపూర్ ప్రాంతంలోని చాంద్ పాషా దర్గాహ్ లో ఆదివారం రాత్రి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన హజరత్ సయ్యద్ జాంపాక్ షహీద్ ఉర్సు ఉత్సవాల్లో గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

*-మల్లాపూర్, జనవరి 13 (నిఘా న్యూస్):*

# మృతిని కుటుంబానికి ఎమ్మెల్సీ దువ్వాడ సాయం



**శ్రీకాకుళం/టెక్కలి, జనవరి 13 (నిఘా న్యూస్):** బోగి వేడుకలలో భాగంగా ఇటీవల కాలంలో అక్కువరం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త వజ్జ రాజన్న మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్,మాధురి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అదే విదంగా టెక్కలి మేదర వీధిలో నిరుపేదరాలు అయిన ఆరి లక్ష్మి,ఆరి.యల్లమ్మకి నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెక్కలి మండలం వైసీపీ జేసీయస్ కన్వీనర్ శిగిలిపల్లి మోహన్,మాజీ డైరెక్టర్ విశ్వనాధం, సంతబొమ్మాళి ఎంపీపీ సభ్యులు మేరుగు. అప్పారావు, సంతబొమ్మాళి మండలం వైసీపీ జేసీయస్ కన్వీనర్ మోడి భాస్కర్ రెడ్డి,సంతబొమ్మాళి వైస్ ఎంపీపీ సభ్యులు పొందల రామకృష్ణ, యల్లయ్య, సూర్యారావు,శ్రీరాములు,శ్రీను,చిన్నరావు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యగిరిలో శ్రీ గోదా రంగనాథ స్వామి కళ్యాణం



**వలిగొండ, జనవరి 13 (నిఘా న్యూస్):** శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వెంకటాపురం నందు నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీగోదారంగనాథ స్వామివార్ల కళ్యాణ మహోత్సవం అర్చకులు, వేదపండితులచే అంగరంగ వైభవంగా భక్తజన సమూహంతో కన్నుల పండుగగా నిర్వహించడమైనది. అనంతరం "నాట్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్యాన్స్" నల్లగొండ వారిచే కూచిపూడి, భరతనాట్యం "చిందు యక్షగాణ కళాబృందం వారిచే మాయ సుభద్ర" నాటకం నిర్వహించారు. దేవస్థానం చైర్మన్, కార్య నిర్వహణాధికారిచే గోదారంగనాథ స్వామి వార్లకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు అందచేశారు. జంగారెడ్డి పల్లి వాస్తవ్యులు బద్దం పుల్లారెడ్డి దంపతులచే భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్ బాబు, ధర్మకర్తలు కొడితాల కరుణాకర్, అర్రూర్ వెంకటేష్, రేఖల ప్రభాకర్, మైళ్ల అంజయ్య, బండి రవికుమార్, గుండు జగన్ మోహన్ రెడ్డి, అంబాల ఊషయ్య, ఈతాప రాములు, జక్కుల కేతమ్మ, కొమిరె బాలేశ్వర్ మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజ్ దంపతులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ వాకిటి అనంతరెడ్డి, మండల నాయకులు, గ్రామ పెద్దలు, అర్చకులు సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

# చిన్నారితో కలిసి తల్లి అదృశ్యం



**కాచిగూడ, జనవరి 13 (నిఘా న్యూస్):** గృహిణి తన మూడేళ్ల కూతురుతో కలిసి కనిపించకుండా పోయిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తిలక్ నగర్ న్యూ ఇందిరా నగర్ కు చెందిన షేక్ మహబూబ్ టెంట్ హౌస్ లో పనిచేస్తాడు. ఈయనకు భార్య అప్సానా బేగం (25), కూతురు మెహరా బేగం (3) ఉన్నారు. ఈనెల 11వ తేదీన మహబూబ్ విధి నిర్వహణ భాగంగా టెంట్ హౌస్ కి వెళ్ళాడు. అదేరోజు మధ్యాహ్నం మహబూబ్ అన్నం తినడానికి ఇంటికి రాగా ఇంటికి తాళం వేసి ఉంది. భార్య కూతురు కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన మహబూబ్ కుటుంబ సభ్యులు, బంధువుల వద్దకు వెళ్లి వాకాబు చేయగా భార్య కూతురి జాడ తెలియలేదు. దీంతో మహబూబ్ కాచిగూడ పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి వారికోసం గాలిస్తున్నారు. ఇంటి నుంచి వెళ్ళినప్పుడు అప్సాన బేగం నల్ల రంగు బుర్కా ధరించి ఉందని మహబూబ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## చైనా మాంజను బహిష్కరించండి

### ఆటో యూనియన్ సంక్రాంతి పోస్టర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**చిలుకానగర్, జనవరి 13 (నిఘా న్యూస్):** సంక్రాంతి ఆటో పోస్టర్ ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ గీతతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరు ఆనంద ఉత్సవాలతో జరుపుకోవాలని ఏ ఒక్కరు కూడా చైనా ప్లాస్టిక్ మాంజా వాడకుండా సాధారణమైన కాటన్ మాంజను వాడుకొని సంక్రాంతి సంబరాలు చేసుకోవాలని, చైనా ప్లాస్టిక్ మాంజ ప్రజల ప్రాణాలు హరిస్తుందని ప్రభుత్వం కూడా ఇటువంటి ప్లాస్టిక్ మాంజా తయారీదారుల పైనే కఠిన చర్యలు చేపట్టే విధంగా కఠినమైన చట్టాలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, అన్న బాలకృష్ణ, ముష్యం శ్రీనివాస్, కోకొండ జగన్, మహబూబ్, పిల్లి నాగరాజ్, నిరంజన్ చారి, ఓంకార్ సింగ్, కడిగే శేఖర్,నవీన్ చారి, శ్యామ్, బూత్కూరు నవీన్, బూత్కూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథల మధ్య జన్మదిన వేడుకలు

### మహేశ్వరం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వల్లపు సుభాన్ యాదవ్




**బాలాపూర్, జనవరి 13 (నిఘా న్యూస్):** మహేశ్వరం నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వల్లపు సుభాన్ యాదవ్ నాదర్గుల్ మాతృదేవోభవ అనాథాశ్రమంలోని అనాథల మధ్య తన పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. ఆశ్రమంలోని సుమారు 150 మంది అభాగ్యులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమంలోని నాతుల శ్రీ శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకులు గట్టు గిరి మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని, ఎవరైనా పుట్టినరోజు, పెళ్లిరోజు, తమ కుటుంబాలలో ఏదైనా శుభకార్యాలను పురస్కరించుకొని సహాయం చేయాలనుకుంటే తమ మాతృదేవోభవ అనాథాశ్రమంలో మతిస్థిమితం కోల్పోయిన అభాగ్యులకు కనీసం ఒక పూట అన్నదానం చేసి వారి ఆకలి తీర్చాలని కోరారు.

## మీర్పేట్, జిల్లెల గూడకు బీజేపీ అధ్యక్షుల నియామకం



**బాలాపూర్, జనవరి 13 (నిఘా న్యూస్):** మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి పార్టీ అధ్యక్షులుగా పసునూరి బిక్షపతి చారి, జిల్లెల్ గూడ పార్టీ అధ్యక్షునిగా తులసి ముఖేష్ ముదిరాజులను పార్టీ జిల్లా పార్టీ అధిష్టానం నియమించి సంబంధిత పత్రాలు అందజేశారు. అధ్యక్షులతో పాటు జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ముత్తంగి కరుణానిధి, కోడూరు సోమేశ్వరులను నియమించారు. ఈ సందర్భంగా బిక్షపతి చారి మాట్లాడుతూ తన నియామకానికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తన మీద నమ్మకంతో ఈ పదవి అప్పగించినందుకు తగిన న్యాయం చేస్తానని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి, రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, అధికార ప్రతినిధి వీరేందర్ గౌడ్, నియోజకవర్గం ఇన్చార్జి శ్రీరాములు యాదవ్, రాష్ట్ర నాయకులు కోలన్ శంకర్ రెడ్డి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తాజా మాజీ అధ్యక్షులు పెండ్యాల నరసింహ తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## డోర్నకల్ లో భోగి వేడుకలు



**డోర్నకల్, జనవరి 13 (నిఘా న్యూస్):** కొత్త సంవత్సర వేడుకల్లో నూతన సంవత్సర మకర సంక్రాంతి భోగి వేడుకలను సాయి నగర్ వాసులు ఘనంగా నిర్వహించారు. సోమవారం మున్సిపల్ కేంద్రంలోని సాయి నగర్ టు ఏరియాలో మకర సంక్రాంతి పర్వదిన సందర్భంగా భోగి మంటలు ఆట పాటలు డాన్సులతో కోరింతలు కొడుతూ ఘనంగా నిర్వహించి కాలనీవాసులు ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ ప్రజలు మండల ప్రజలు ఆరోగ్యాల పాడిపంటలతో సంతోషంగా ఉండాలని భోగి మంటలు నిర్వహిస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకలలో పోటు దివ్య శేఖర్ స్వాతి సింధు వరలక్ష్మి. సురేష్ సుధమ్మ ఉమా సాయి. తౌజి. అప్రోచ్. పాల్గొని. కాలనీవాసులకు శుభాకాంక్షలు తెలిపారు.

# నిమ్మాడలో మంత్రి అచ్చన్న సంక్రాంతి సంబరాలు





**శ్రీకాకుళం/కోటబొమ్మాళి, జనవరి 13 (నిఘా న్యూస్):** నిమ్మాడలో సంక్రాంతి సందర్భంగా గ్రామస్థులతో ముచ్చటించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వేళ బిజీ బిజీగా గడిపారు.వ్యవసాయ మంత్రి స్థానిక సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల సమస్యలు తెలుసుకొని అధికారులకు తగు సూచనలు,సలహాలు చేస్తూ త్వరితగతిన ప్రజా సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారు. బోగి పండుగ సందర్భంగా సంక్రాంతి వేళ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిమ్మాడలో గ్రామస్థులతో ముచ్చటించారు. సొంతూళ్లో సంక్రాంతి వేడుకలను జరుపుకుంటున్నారు. భోగి పండగ వేళ కింజరాపు కుటుంబం అంతా ఒకే చోట చేరి ఆనందాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ సిరి సంపదలతో రాష్ట్రం తులతూగాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. అనంతరం తనను కలిసిన గ్రామస్థులతో ముచ్చటించి, వారి సమస్యలను సావధానంగా విని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.పండుగ వేళ సకల శుభాలూ కలగాలని, కూటమి ప్రభుత్వం వ్యవసాయదారులకు అండగా ఉండేందుకు నిరంతరం పని చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో రైతుల అభ్యున్నతికి తమ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.రాగ ద్వేషాలకు అతీతంగా గ్రామాలలో ఈ పెద్ద పండుగ చేసుకోవాలని,పల్లెల వృద్ధే దేశాభివృద్ధి అని అన్నారు. ఆయన వెంట కింజరాపు హరి వర ప్రసాద్, గ్రామస్థులు ఉన్నారు.

## నృత్య కళాకారిణి మోక్షాధృతికి స్వర్ణనంది అవార్డు






**ఘట్ కేసర్, జనవరి 13 (నిఘా న్యూస్):** నృత్యం పట్ల ఆసక్తి, అభిరుచితో పాటు కళానైపుణ్యానికి మెరుగులు దిద్దుకుని శాస్త్రీయ నృత్యంలో రాణించిన కూచుపుడి నాట్య కళాకారిణి మోక్షాధృతి అభినందనీయురాలని మాజీ న్యాయమూర్తి బుర్గుల మధుసూదన్ తెలిపారు. నగరంలోని శ్రీత్యాగరాయ గానసభలో మహతి ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో స్వర్ణనంది అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ న్యాయమూర్తి మధుసూదన్, రిటైర్డ్ ఐఎస్ అధికారి ఆర్ వి చంద్రవదన్, సంఖ్యా శాస్త్రవేత్త దైవజ్ఞశర్మ, ప్రముఖ కూచిపూడి నాట్య గురువు పి.జాన్సీరామ్ లు పాల్గొన్నారు. అభిరుచి అంకిత భావంతో పాటు కఠోర శ్రమ ఉన్నప్పుడే జాతీయ, అంతర్జాతీ స్థాయికి చేరుకోవచ్చున్నారు. ఈ సందర్భంగా జరిగిన నృత్య ప్రదర్శనలో ఎన్ ఎఫ్ సి నగర్ కు చెందిన మోక్షా ధృతి అత్యంత ప్రతిభాపాటవాలు ప్రదర్శించిన కుమారి మోక్షాధృతి స్వర్ణనంది ఆవార్డు అందుకున్నారు. శాస్త్రీయ నృత్యంలో రాణించేందుకు అసాధారణమైన నృత్య ప్రదర్శనలు చేయాలని, పట్టుదల, క్రమ శిక్షణ కలిగిన ప్రతి ఒక్కరు అత్యంత ప్రతిష్టాత్మకమైన గుర్తింపు పొందుతారని చెప్పారు. నృత్య ప్రదర్శనలో కుమారి మోక్షాధృతి నృత్య ప్రదర్శనను దైవజ్ఞ శర్మ అభినందించారు. ఈ సందర్భంగా నాట్యగురువు జాన్సీరామ్ ను శాలువాలు, పూలమాలలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పసుమర్తి శేషుబాబు, సజని వల్లభనేని, నిర్వహకులు, నాట్యగురువులు, తల్లిదండ్రుల, నృత్య కళాకారణీలు పాల్గొన్నారు.



మాజీ ముఖ్యమంత్రి దివంగత మర్రి చెన్నారెడ్డి 106 వ జయంతి సందర్భంగా ఇందిరా పార్క్ లోని ఆయన సమాధి వద్ద రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి కోటం అనిల్ కుమార్ నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో చిన్నారెడ్డి మనమడు, బిజెపి రాష్ట్ర నాయకుడు మర్రి పూర్వరెడ్డి, దుద్దం వెంకటరమణ, దుండిగళ్ల మల్లికార్జున్, సి.బాబురావు, దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.

*-అంబర్ పేట, జనవరి 13 (నిఘా న్యూస్):*

## విశాఖ ప్రజలకు మేయర్ సంక్రాంతి శుభాకాంక్షలు



**విశాఖపట్నం, జనవరి 13 (నిఘా న్యూస్):** విశాఖ నగర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. పండుగని సంప్రదాయ రీతిలో కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నగర పరిశుభ్రతకు అందరూ సహకరించాలని సూచించారు.అధికారులకు జీవీఎంసీ సిబ్బందికి కూడా ఆమె సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రధాని పరీక్షా పే చర్చకు ఊరుందూరు పాఠశాల విద్యార్థి



**శ్రీకాళహస్తి, జనవరి 13 (నిఘా న్యూస్):** కేంద్ర ప్రభుత్వం అధ్వర్యంలో ప్రధానమంత్రి అధ్యక్షతన నిర్వహించే పరీక్ష పే చర్చా కార్యక్రమానికి శ్రీకాళహస్తి నియోజకవర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఊరుందూరు గ్రామం నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థి శ్రీకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థిని ఉపాధ్యాయుడు శ్రీనివాసులను ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి అభినందించడం జరిగింది. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి మాట్లాడుతూ తిరుపతి జిల్లా నుంచి ఒకే ఒక విద్యార్థి ఎన్నిక కావడం అది కుడా శ్రీ కాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే స్వంత గ్రామంలోని పాఠశాల విద్యార్థి ఎంపిక కావడం చాలా సంతోషకరమని తెలిపారు. ఈ పరీక్షా పే చర్చ 14, 15, 16వ తేదీలలో ఢిల్లీలో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రితో చర్చా కార్యక్రమంలో పాల్గొని పరీక్షలపై విద్యార్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. పరీక్షలపై విద్యార్థులకు ఉన్న సందేహాలపై ప్రధానమంత్రిని ప్రశ్నించడం,దపరీక్షలను ఎలా ఎదుర్కోవాలి, ఒత్తిడిని ఎలా అధిగమించాలి, పరీక్షలను పండుగలాగ ఎలా భావించాలనే అంశాలను ప్రధానమంత్రితో చర్చిస్తారు. ఈ కార్యక్రమంలో ఊరుందూరు పాఠశాల గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితా రెడ్డి కూడా విద్యార్థిని ఉపాధ్యాయుని పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో సురేష్ బాబు శాంతి మల్లికార్జున మురళి తల్లిదండ్రులు సుధాకర్ రాజి పాల్గొన్నారు.

## పత్తిపాకలో రంగవల్లుల పోటీలు




**ధర్మపురి, జనవరి 13 (నిఘా న్యూస్):** ధర్మారం మండలంలో స్వామి వివేకానంద162వ జయంతి వీక్లీ సెలబ్రేషన్ లో భాగంగా సోమవారం నెహ్రూ యువ కేంద్రం,ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగళల్లుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పత్తిపాక గ్రామ కార్యదర్శి కిరణ్,పత్తిపాక ఫీల్డ్ ఆఫీసర్ భాస్కర్, యువజన వాలంటరీ రేషవేణి, మహేష్ హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించి పోటీలో విజేతలుగా నిలిచిన వారికి మొదటి బహుమతి ద్వితీయ బహుమతి, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా గోదా రంగనాథ స్వామి కళ్యాణం



**వరంగల్, జనవరి 13 (నిఘా న్యూస్):** వరంగల్ నగరంలోని ఉర్సు గుట్టపై సోమవారం గోదా రంగనాథ స్వామి దేవాలయం అభివృద్ధి పరుచుటకు తాను శాయ శాక్తుల కృషి చేస్తానని 40 వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. భోగి పండుగ సందర్భంగా ఉర్సు గుట్టపై గోదా రంగనాథ స్వామి కళ్యాణం వైభవంగా జరిగింది. ఈ కళ్యాణంలో భక్తులతో పాటు కార్పొరేటర్ మురుపల్ల రవి పాల్గొని డివిజన్ లోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండి ఆరోగ్యంగా జీవించటానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా డివిజన్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుటకు స్వామివారి కృప కలగాలని వేడుకున్నారు. అనేక మంది భక్తులు కళ్యాణంలో పాల్గొన్నారు. కొంతమంది భక్తులు అన్నదానం నిర్వహించినారు, మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ అలంకరణ, మంచినీటి వసతి పారిశుద్ధ్య పనులు చేపట్టినామని కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. ఆలయ ప్రధాన పూజారి వరియోగుల భాస్కరాచారి, రవీందర్, హరి ప్రసాద్, లక్ష్మీ ప్రసాద్, ప్రవీణ్, కృష్ణ మంత్రోచ్చారణ గావించి కళ్యాణంను నిర్వహించారు. ఆలయ ప్రధాన భక్తులు గట్ల నరేందర్, తౌటు గ్యాన్దేవ్, అంకం లక్ష్మీనారాయణ, అడ్డగట్ల జ్ఞానేశ్వర్, మరుపల్ల గౌతమ్, కోడం రమేష్, బోరిగం రాజు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గోదా రంగనాయకుల కళ్యాణం



**బాలాపూర్, జనవరి 13 (నిఘా న్యూస్):** కర్మన్ ఘాట్ అభయాంజనేయ స్వామి దేవస్థానంలోని కోదండ రామాలయంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన సోమవారం గోదా రంగనాయకుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ మూర్తులను ఆసీనులను చేసి వేద మంత్రోచ్చారణల మధ్య పండితులు స్వామి వారి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ ఎన్ లావణ్య ఆదేశాల మేరకు అర్చకులు, సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కళ్యాణోత్సవంలో మాజీ ధర్మకర్తలు, ప్రజాప్రతినిధులు భక్తులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు: డిప్యూటీ సీఎం

### ఖమ్మం కలెక్టరేట్ లో మంత్రుల సమీక్ష

**ఖమ్మం, జనవరి 13 (నిఘా న్యూస్):** అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, పారదర్శకంగా లబ్ధి చేకూరుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ పథకాల అమలుపై ఖమ్మం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా ఇంఛార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేశ్ వి. పాటిల్ లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి నాలుగు కొత్త పథకాలను గణతంత్ర దినోత్సవం నుంచి అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ పథకాలకు ప్రభుత్వం దాదాపు రూ. 45 వేల కోట్లకు పైగా ఖర్చు చేయబోతుందని చెప్పారు. ప్రతి పథకంపై సంపూర్ణంగా చర్చించి మార్గదర్శకాలు జారీ చేశామని అన్నారు. ప్రతి పథకానికి లబ్దిదారులను గ్రామ సభ పెట్టి పారదర్శకంగా ఎంపిక చేయాలని అన్నారు. ఇందిరమ్మ కమిటీల సభ్యులను భాగస్వామ్యం చేయాలని, ప్రతి గ్రామ సభలో కార్యక్రమం పెట్టి ప్రభుత్వ లక్ష్యాలు తెలియజేయాలని, జిల్లా మంత్రి చే జాబితా ఆమోదింపచేసుకొని మంజూరు ప్రోసిడింగ్స్ అందజేయాలని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పలు గ్యారెంటీ పథకాలను అమలు చేశామని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు చేరడం ఎంత ముఖ్యమో, అనర్హులకు అందకుండా వృధా కాకుండా చూడడం కూడా చాలా కీలకమని మంత్రి తెలిపారు. భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబానికి దేశంలో ఎక్కడా లేని విధంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ సందర్భంగా 4 పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని, దీనికి సంబంధించిన విధివిధానాలను క్యాబినెట్ ఆమోదించిందని అన్నారు. ప్రభుత్వ ఆలోచనలు అధికారులు పక్కాగా అమలు చేయాలని, ఎక్కడ ఎటువంటి తప్పు జరుగడానికి వీలు లేదని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో పేదలకు కులమతాలకు అతీతంగా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రస్తుతం 4 లక్షల 50 వేల ఇండ్లు ఇస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని ఇండ్లు మంజూరు అవుతాయని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా ఉంటూ వ్యవసాయ యోగ్యం కాని భూములకు ఎక్కడా పెట్టుబడి సహాయం చేరవద్దని, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హుడికి సహాయం అందేలా చూడాలని అన్నారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు పంట వేసినా, వేయకపోయినా




రైతు భరోసా అందుతుందని అన్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటేశ్వర్లు, అశ్వారావు పేట ఎమ్మెల్యే ఆదినారాయణ, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఖమ్మం సీపీ సునీల్ దత్, కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, ఐ.టి.డి.ఎ.పి.ఓ.బి. రాహుల్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, ఉమ్మడి జిల్లాల ప్రజాప్రతినిధులు, ఉమ్మడి జిల్లాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్స్ డైరీ ఆవిష్కరించిన

### ఎస్సై గడ్డం ఉమ




**డోర్నకల్, జనవరి 13 (నిఘా న్యూస్):** స్నేహ భావంతో కలిసికట్టుగా ఉంటూ ప్రతి ఫోటోగ్రాఫర్ సంఘ సభ్యులు ఉండాలని డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ అన్నారు. సోమవారం మున్సిపల్ కేంద్రంలోని మసీద్ కాంప్లెక్స్ లో డోర్నకల్ మండల ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ డైరీ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించి ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఫోటోగ్రఫీ ఒక మధురమైన కల చిన్ననాటి నుండి శుభకార్యాలకు చివరి జ్ఞాపకాలను ఫోటోలతోనే చూస్తామని నేటి తరుణంలో ఉన్నంతమైన చదువులు చదివి ఫోటో రంగాన్ని ఏర్పాటు చేసుకొని స్నేహభావంతో సంఘ సభ్యులుగా ఏర్పడి ప్రతి ఒక్కరు లైఫ్ మెంబర్షిప్ చేసుకోవటం సంతోషకరమని, సంఘ సభ్యులు కలిసికట్టుగా ఉంటూ ప్రజలకు ఫోటోగ్రఫీ సేవలు అందించాలని కొత్త సంవత్సర వేడుకలలో ఆరోగ్యాలతో ఉండాలని ఎస్సై ఉమ కోరారు. డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో కొలిపాక పుల్లారావు పోటు శేఖర్ ముద్దం భాస్కర్ భీమనబోయిన సత్యనారాయణ గాయకులు వీరబోయిన ఉపేందర్ మోతిలాల్ రవి వర్మ కొలిపాక అరుణ యాకయ్య రామకృష్ణ, భాషని నాగేష్ ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## అన్నపూర్ణాదేవి ఆలయాన్ని పునః నిర్మిద్దాం

### ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి





**పలమనేరు, జనవరి 13 (నిఘా న్యూస్):** పెద్దపంజాణి మండలం బాబు అగ్రహారంలో ఉన్న ఆ దేవాలయానికి ఒక చరిత్ర ఉంది వందల సంవత్సర కాలంలో అద్భుతంగా పూజలు అందుకుంది అన్నపూర్ణాదేవి ఆలయం. ఒక సాధువు పాదయాత్ర సమయంలో అలసిపోయి అక్కడున్న దేవాలయంలో సేద తీర్చుకుంటూ ఆ దేవాలయంలో కొలువులేని దేవుళ్లను చూసి అన్నపూర్ణాదేవి విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు చేయడం కొనసాగించాడు. అక్కడే ఉన్న కోనేరు లోని నీటితో అమ్మవారికి అభిషేకం చేస్తూ వచ్చాడు. ఇదే ఆనవాయితీగా తరతరాలుగా పూజలు అందుకుంటున్న అన్నపూర్ణాదేవి ఆలయం నేడు శిథిలావస్థలో పడిపోయింది. గుప్త నిధుల కోసం అన్నపూర్ణాదేవి ఆలయాన్ని ధ్వంసం చేసిన అగంతకులు. శిథిలావస్థలో ఉన్న దేవాలయంలోని పూజలు చేస్తూ వస్తున్నారు. బాబు అగ్రహారం గ్రామస్తులు. కోరిన కోరికలు వెంటనే తీర్చే అమ్మవారి దేవాలయాన్ని పునః ప్రారంభించడానికి తన వంతు సాయంగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన వెంకటేశు ముందుకు వచ్చారు. తన కుల దైవం అన్నపూర్ణాదేవి ఆలయాన్ని పునః ప్రారంభించడానికి వచ్చిన అవకాశం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. పెద్దపంజాణి మండలం చలమంగళం గ్రామానికి చెందిన భాస్కర్ మాట్లాడుతూ గుప్తనిధుల కోసం దేవాలయాలను ధ్వంసం చేయడం బాధాకరమని తన ఊహ వచ్చినప్పటి నుండి అన్నపూర్ణా దేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అంగరంగ వైభవంగా పూజలందుకున్న అన్నపూర్ణాదేవి ఆలయం నేడు శిథిలావస్థలో మారిందంటే బాధాకరమని ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, నాయకులు, దాతలు సహకారం అందిస్తే అన్నపూర్ణ దేవి ఆలయాన్ని పునః ప్రారంభించి నిత్యం పూజలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొట్ట గాని పల్లె గ్రామస్తులు, బాబు అగ్రహారం గ్రామస్తులు, చలమంగళం గ్రామస్తులు పాల్గొన్నారు.

## నరువి ఆసుపత్రిలో సంక్రాంతి సంబరాలు

### సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న డాక్టర్ జీవి సంపత్



**తిరుపతి, జనవరి 13 (నిఘా న్యూస్):** వేలూరులోని నరువి ఆసుపత్రిలో సంక్రాంతి సంబరాలలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సాహంగా జరుపుకున్న జరుపుకున్న సంబరాలను నరువి ఆసుపత్రి వైస్ ఛైర్ పర్సన్ అనిత ప్రారంభించారని తెలిపారు. ఈ సంక్రాంతి సంబరాలు నరువి హాస్పిటల్ స్టాఫ్ కుల మతాలకు అతీతంగా పురుషులు, మహిళలు వయో పరిమితి తేడాలు లేకుండా పాల్గొని ఉత్సాహంగా జరుపుకున్నారు. 'సమైక్యత,సమానత లకు మారుపేరైన సంక్రాంతి పండుగతో పాటు, పంటల కాలం కావడంతో రైతులకు అభినందనల కార్యక్రమాలను వేలూరులోని నరువి ఆసుపత్రిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను నరువి ఆసుపత్రి ఛైర్మెన్, అనితా సంపత్ వైస్ ఛైర్ పర్సన్ ప్రారంభించారు. ఇందులో భాగంగా మట్టి కుండలతో పొంగల్ తయారు చేయడంతో పాటు సంగీత, జానపద క్రీడలను నిర్వహించారు. ఇందులో సిలంబాట్టం (సంప్రదాయమైన కర్రసాము), ఉయిరిడత్తల్ (సంప్రదాయ డప్పులను వాయించడం), రోప్ క్రీడలు,చెరకు ముక్కల పంపిణీ లాంటివి తమిళనాడులోని ఇళ్లలో సమగ్రంగా జరుపుకునే పండుగను నిర్వహించారు. డాక్టర్లు, నర్సులు ఉత్సాహంగా పాల్గొన్న క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసిన డాక్టర్ సంపత్ మాట్లాడుతూ తమిళ ప్రజలు సంక్రాంతి పండుగగా జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ పండుగ ప్రజలను కుల మతాలకు అతీతంగా సమైక్యత చేస్తుందని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ కుటుంబాలను కలుపుతుందని, అనేక మంది తమ స్వగ్రామాలకు చేరుకుని, సమయాన్ని గడిపే పండుగని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ జాకబ్ పాల్,జనరల్ మేనేజర్ నితిన్ సంపత్, అభిరామి సంపత్ పాల్గొన్నారు.

## సహకార సంఘం క్యాలెండర్లను ఆవిష్కరించిన చైర్మన్లు



ధర్మపురి, జనవరి 13 (నిఘా న్యూస్) నంది మేడారం, పత్తిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఛైర్మన్ లు ముత్యాల బలరాం రెడ్డి, నోముల వెంకట రెడ్డి 2025 సంవత్సర క్యాలెండర్ లను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాలలో సంఘ పాలక వర్గంతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ లు సామంతుల రాజమల్లు, పసునూటి శ్రీనివాస్,డైరెక్టర్లు బొడ్డు మల్లయ్య, భారత స్వామి, మోర కొమురయ్య, దీటి శ్రీనివాస్, తమ్మడవేని రాజయ్య, సాయిరి కుమార్, పాలమాకుల తిరుపతిరెడ్డి, ఈదుల శివకుమార్ రెడ్డి,ఇస్లావత్ రూపా నాయక్, మెన్నేని వెంకటేశ్వర రావు,బద్దం రవీందర్ రెడ్డి,బద్దం లింగారెడ్డి,నిమ్మ మల్లయ్య, సెక్రటరీ తోర్తి బుచ్చయ్య,సిబ్బంది పాల్గొన్నారు.

## పలమనేరు హెూమియోపతి వైద్యురాలిగా ఉమారాణి



**పలమనేరు, జనవరి 13 (నిఘా న్యూస్):** పలమనేరు ప్రభుత్వ హెూమియోపతి వైద్యురాలిగా పట్టణానికే చెందిన డా. ఉమారాణి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆమె 2023 ఏప్రిల్ లో ప్రభుత్వం నిర్వహించిన ఏపీపీఎస్సీ ఎగ్జామ్స్ లో ఉత్తీర్ణత సాధించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం ముగ్గురు అభ్యర్థులు ఉత్తీర్ణ సాధించగా వారిలో ఉమారాణి మొదటి స్థానంలో నిలిచింది. ఇలా ఉండగా ఈనెల 13న ఆమెను హెూమియోపతి వైద్యురాలిగా నియమిస్తూ ఆయుష్ కడప రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ నుంచి అపాయింట్మెంట్ ఆర్డర్స్ అందాయి. గత కొన్నేళ్లుగా పలమనేరు హెూమియోపతి వైద్యశాలలో ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో పలమనేరులో ఆమెకు పోస్ట్ కల్పించారు. దీంతో సోమవారం ఆమె స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డినుండిఉద్యోగబాధ్యతఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించి మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు రామచంద్ర నాయుడు తదితరులు పాల్గొ న్నారు.




బాధ్యతాయుత సమాజం కోసం ఫోరం ఫర్ ఆర్టిఐ జాయింట్ సెక్రటరీగా అజయ్ ప్రసన్న కుమార్ ను నేషనల్ ప్రెసిడెంట్ పి.చంద్ర మోహన్ నియమించారు. గత కొన్ని సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాలలో అవినీతి రహిత సమాజం అనే ఆశయంతో నిజాయితీ గా పని చేస్తున్న మంచి సంస్థ గా గుర్తింపు తెచ్చుకున్న ఎఫ్ ఆర్ టీ ఐనేషనల్ కమిటీ.

*-తిరుపతి, జనవరి 13 (నిఘా న్యూస్):*

## బిజెపి మండల అధ్యక్షుడిగా గణేష్ నాయక్




**డోర్నకల్, జనవరి 13 (నిఘా న్యూస్):** మండల బీజేపీ అధ్యక్షులుగా రెండోసారి ఎన్నికైన బానోతు గణేష్ నాయక్ సోమవారం మున్సిపల్ కేంద్రంలో మాట్లాడుతూ రెండో సారి అవకాశం ఇచ్చిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అలాగే రాష్ట్ర పార్టీ నాయకులకు జిల్లా అధ్యక్షులు యలమంచిలి వెంకటేశ్వరరావ్ జిల్లా నాయకులకు మండల నాయకులకు గ్రామ బూత్ అధ్యక్షులకు ధన్యవాదములు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టిన సంశేమా పథకాలను ప్రతి గడప గడపకు తీసుకెళ్తాను రానున్న కాలంలో భారతీయ జనతా పార్టీదే అధికారంలోకి వస్తుందని. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదు మోసం చేసి అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కి వచ్చే ఎన్నికలలో ఓటమి తప్పదనీ భారతీయ జనతా పార్టీ డోర్నకల్ మండలం అధ్యక్షుడు బానోతు గణేష్ నాయక్ అన్నారు.

# అనుపల్లిలో వైభవంగా పశువుల పండగ

### కోడెగిగిత్తల జోరు యువకుల హుషారు

**రామచంద్రపురం, జనవరి 13 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలంలోని అనుప్పల్లె గ్రామంలో సోమవారం పరుష పందేలు అంగరంగ వైభవంగా జరిగాయి. సోమవారం సంక్రాంతి పర్వదినాలలో మొదటి రోజైన భోగి పండుగ రోజున రాష్ట్రంలో మొట్టమొదటగా చంద్రగిరి నియోజకవర్గం అనుపల్లి గ్రామంలో నిర్వహించిన పశువుల పండుగతో రాష్ట్ర మొత్తం జల్లికట్టు ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అనుపల్లె గ్రామంలో రంకేసిన కోడిగిత్తలు. యువకుల జోరుతో జల్లికట్టు జోరుగా సాగింది. గ్రామంలో రైతు కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటున్న కోడెగిత్తలు, ఆవులను రైతులు వాటి కొమ్ములను నున్నగా చెక్కి కొమ్ములకు రంగులు పూసి వాటిని శుభ్రంగా కడిగి పూజించారు. కోడేగిత్తల కొమ్ములకు చెక్క పలకలు,నూతన వస్త్రాలు, వేలాది రూపాయల పారితోషకంగా నగదును కట్టి నా కోడిగిత్తల పౌరషాన్ని చూడండి అంటూ వాటి యజమానులు మీ వల్ల అయితే పట్టుకోండి చూద్దాం అంటూ యువతకు సవాళ్లు విసిరారు. కోడెగిత్తల కొమ్ములకు బంగారు, వెండి ఆభరణాలు, అభిమాన, రాజకీయ,సినీ నటుల ఫోటోలతో కూడిన చెక్క పలకలను కొమ్ములకు కట్టి దొడ్లో నుంచి పందేళ్ళ బరిలోకి దించి, కోడెగిత్తలను డబ్బులు కొడుతూ బెదిరించి పరుగులు చేయించారు. అప్పటికే వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యువత గుంపులు గుంపులుగా చేరి పశువులకు కట్టిన బంగారు వెండి



ఆభరణాలు, నగదు, పలకలను చేజికిచ్చేందుకు పోటీపడ్డారు. పశువుల పాక నుండి బరిలోకి దించి కోడెగిత్తలు వెనక డప్పులు వాయిస్తూ వాటిని బెదరకొట్టగా అవి బెదిరి దూకుడుగా పరిగెత్తుతుండగా యువకులు పౌరుషంతో పశువులు, కోడిగిత్తల పట్టుకునేందుకు బీదర్ పరుష పందాలలో పశువులను పట్టుకుని చేజిక్కించుకున్న బహుమతులను ప్రేక్షకులకు చూపిస్తూ నేనే విజేతను అంటూ యువకులు కేరింతలు వేశారు. ఈ పోటీలలో కోడెగిత్తలు బెదిరి పరుగుతో ముందుకు వెళ్తున్న వాటిని నిలువరించేందుకు చేసే క్రమంలో చెదురు మదుర సంఘటనలో కొంతమంది యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. పరుష పందాలను తిలకించేందుకు విచ్చేసిన జనాలతో అనుపల్లి గ్రామం జనసంద్రమైంది.



కోడి గిత్తల కొమ్ములకు పశువుల యజమానులు తమ అభిమాన రాజకీయ నాయకుల ఫోటోలు పార్టీ జెండాలతో చెక్క పలకను విశేషంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ పరుస పందాలను తిలకించేందుకు దేశ విదేశాల నుండి,తెలంగాణ తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుండి భారీగా తరలివచ్చారు, మందుబాబుల ఆగడాలు చెప్పనలివి కాలేదు. వారి మత్తులో మునిగితేలి సరదాగా గడిపారు. పరుష పందాలకు విచ్చేసిన ప్రేక్షకులకు గ్రామానికి చెందిన తారాసి యశ్వంత్, బొడ్డు ముని ప్రసాద్ లు అన్న పానీయాలను పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## పెన్షన్ మంజూరు చేయాలని చంద్రబాబు ఆదేశం



**తిరుపతి, జనవరి13 (నిఘా న్యూస్):** చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని నారావారి పల్లి నందు నేటి సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి ఇంటి వద్దకు వస్తున్న సీఎం చంద్రబాబు, వృద్ధ దంపతులను చూసి చలించిపోయి వారికి పెన్షన్ అందించేందుకు భరోసా ఇస్తూ మరోసారి మానవత్వం చాటుకున్నారు. సిఎం వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ఎక్కడి నుండి వచ్చారు. సమస్య ఏంటని అడిగారు. తన పేరు బి. నాగరాజమ్మ భర్త సుబ్బరామయ్య అని, భీమవరం గ్రామం చంద్రగిరి మండలం అని పక్షవాతంతో సుమారు ఐదు సంవత్సరాలుగా బాధపడుతున్నానని, నడవలేక పోతున్నానని, దివ్యాంగ పెన్షన్ ఇవ్వాలని విన్నవించుకోగా వెంటనే దివ్యాంగ పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ను ఆదేశించారు..

## సంతోషాలను పంచుకునే పండగ సంక్రాంతి



**బెల్లంకొండ, జనవరి 13 (నిఘా న్యూస్):** మండల ప్రజలకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ప్రజలందరికీ భోగి మకర సంక్రాంతి కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మండల బీసీ సెల్ అధ్యక్షులు గుంజ గంగారావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు లోగిళ్లలో ఆనందాలు పంచే సంక్రాంతి మనకు ప్రత్యేకమైన పండుగ. ఈ ఫెస్టివల్ తోనే మనకు కొత్త సంవత్సరంలో పండుగలు మొదలైనట్లు అవుతుంది. ఈ పండుగతోనే వాతావరణంలో చలి తగ్గుతూ వేడి పెరగడం మొదలవుతుంది. ఇది రైతులకు మేలు చేసే పండుగ. నాలుగు నెలల కష్టానికి ఫలితంగా పంట చేతికి వచ్చి వారు నలుగురితో కలిసి తమ సంతోషాన్ని పంచుకునే మంచి పండుగ సంక్రాంతి. ఇక కొత్త అల్లుళ్ల రాకతో అత్తారింట సందడి అంతా ఇంతా కాదు. ఏ ఇల్లు చూసినా సరికొత్తగా కనిపిస్తుంది.ఏ వాకిట చూసినా రంగవల్లులతో ఆకట్టుకుంటుంది.

## ఆర్ యుపిపి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కుమారస్వామి



**వరంగల్, జనవరి 13 (నిఘా న్యూస్):** రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా చిగిరి కుమారస్వామి ( సి కె )ఎన్నిక వరంగల్ జిల్లాలోని రంగశాయిపేట ప్రాంతానికి చెందిన చిగిరి కుమారస్వామి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారు. కుమారస్వామి వరంగల్ జిల్లా కిలా వరంగల్ మండలం లోని గాడేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో విధులు నిర్వహిస్తున్న కుమారస్వామి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల కార్పొరేటర్ గుండు చందన, జక్కం దామోదర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి వెంకన్న ,ప్రవీణ్ కుమార్ అంకేశ్వరపు కుమారస్వామి సదానందం బివీఎస్ ప్రసాద్ బొలిశెట్టి కమలాకర్ జక్కం సుదర్శన్ బక్కి శ్రీధర్ వేణు ఏలుగు రవికుమార్ కడారి మహేష్ రావుల నవీన్ దామర కొండ నిరంజన్ మచ్చ కుమార్ నంద రమేష్ మండల చిరంజీవి చాపల నాగరాజు తదితరులు అభినందనలు తెలిపారు. నూతనంగా ఎంపికైన ఉపాధ్యక్షుడు చిగిరి కుమారస్వామి మాట్లాడుతూ సంఘం బాధ్యతాయుతమైనదని నన్ను ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ శక్తివంచన లేకుండా పని చేస్తానని అన్నారు.

# మత్స్యగిరిలో శ్రీ గోదా రంగనాథ స్వామి కళ్యాణం

**వలిగొండ, జనవరి 13(నిఘా న్యూస్):** శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వెంకటాపురం నందు నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీగోదారంగనాథ స్వామివార్ల కళ్యాణ మహోత్సవం అర్చకులు, వేదపండితులచే అంగరంగ వైభవంగా భక్తజన సమూహంతో కన్నుల పండుగగా నిర్వహించడమైనది. అనంతరం "నాట్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్యాన్స్" నల్లగొండ వారిచే కూచిపూడి, భరతనాట్యం "చిందు యక్షగాణ కళాబృందం వారిచే మాయ సుభద్ర" నాటకం నిర్వహించారు. దేవస్థానం చైర్మన్, కార్య నిర్వహణాధికారిచే గోదారంగనాథ స్వామి వార్లకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు అందచేశారు. జంగారెడ్డి పల్లి వాస్తవ్యులు బద్దం పుల్లారెడ్డి దంపతులచే భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్ బాబు, ధర్మకర్తలు కొడితాల కరుణాకర్, అర్రూర్ వెంకటేష్, రేఖల ప్రభాకర్, మైళ్ల అంజయ్య, బండి రవికుమార్, గుండు జగన్ మోహన్ రెడ్డి, అంబాల ఊషయ్య, ఈతాప రాములు, జక్కల కేతమ్మ, కొమిరె బాలేశ్వర్ మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజ్ దంపతులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ వాకిటి అనంతరెడ్డి , మండల నాయకులు, గ్రామ పెద్దలు, అర్చకులు సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు.



# కష్టాలను భోగి మంటల్లో వేద్దామన్న ఎమ్మెల్యే



### పలు ఆలయాల్లో యార్లగడ్డ దంపతుల పూజలు

**గన్నవరం, జనవరి 13 (నిఘా న్యూస్):** కష్టాలు, బాధలను ఈ భోగి మంటల్లో వేసి ఆ అగ్నిదేవుడికి ఆహుతి ఇద్దాం, ఈ భోగి, సంక్రాంతి, కనుమ మనందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని కోరుకుంటూ తెలుగు వారందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అనంతరం రాష్ట్ర శ్రేయస్సు కోసం విజయవాడ లోని దుర్గామల్లేశ్వర ఆలయం, అమరావతి లోని అమరలింగేశ్వర స్వామి ఆలయం, భీమవరంలోని శ్రీ సోమేశ్వర స్వామి దేవాలయం, పాలకొల్లులోని క్షీరా రామలింగేశ్వర స్వామి దేవాలయం, ద్రాక్షారామంలోని భీమేశ్వర స్వామి దేవాలయం, సామర్లకోట లోని శ్రీ కుమారారామ భీమేశ్వరస్వామి వారి దేవాలయం మొదలగు పుణ్యక్షేత్రాలలో యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు భక్తి పూర్వకంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు వారికి పూర్ణ కుంభంతో ఘనస్వాగతం పలికి దర్శనం అనంతరం ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

## భోగభాగ్యాలతో భోగీ పండుగ వేడుకలు



**ఘట్‌కేసర్, జనవరి 13(నిఘా న్యూస్):** భోగభాగ్యాలతో భోగి పండుగ వేడుకలను ఘట్ కేసర్ మున్సిపల్ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఘట్ కేసర్ పట్టణంతో పాటు గ్రామాలలో దక్షణాయనానికి చివరి రోజుగా భోగిని భావించి తమ కష్టాలను తొలగించాలని ప్రజలు అగ్నిదేవుడిని ప్రార్థిస్తు భోగి మంటలు వేశారు. సోమవారం తెల్లవారు జాము నుండే మహిళలు, బాలికలు రంగురంగుల ముగ్గులు వేసి పాడుతూ డ్యాన్స్ లు చేస్తూ సందడి చేశారు. ఘట్ కేసర్ పట్టణంతో పాటు ఎన్ ఎఫ్ సీ నగర్, అవుషాపూర్, అంకుషాపూర్, ఎదులాబాద్, మాదారం, మర్రిపల్లిగూడ, ఘనపూర్ గ్రామాలలో భోగి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల ముగ్గుల పోటీలు నిర్వహించి బహు మతులు అందజేశారు. బోగి పండుగ వేడుకలలో ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## కోడి పందాలను ప్రారంభించిన డిప్యూటి స్పీకర్

**విజయవాడ,జనవరి13(నిఘా న్యూస్):** సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏపీలోని పలు ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలోని సూరంపల్లి, రామవరప్పాడు, అంపాపురం లో వీటిని నిర్వహించారు. పల్లెల్లోని బరుల్లోనూ పందేలు ఏర్పాటు చేశారు. వీటిని చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.

ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గంలో కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. నందిగామ, చందర్లపాడులో ఈ పోటీలు సాగుతున్నాయి. కంచికచర్ల మండలం గండేపల్లి వద్ద టెంట్లు ఏర్పాటు చేసి భారీ ఎత్తున పందేలు నిర్వహిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో కోడి పందేలను డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు ప్రారంభించారు.



జిల్లాలోని ఉద్యోగులకు, ప్రజలకు ఎ. పి. మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్స్ అండ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ పూర్వం గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు, క్రోసూర్ తాలూకా యూనిట్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శిఖా శాంసన్ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులంతా ప్రజలంతా సుఖ సంతోషాలతో, భోగ భాగ్యాలతో, సిరి సంపదలతో తులతూగుతూ ఉండాలని, భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఆనందంగా జరుపుకోవాలని ఈ పండుగ అందరి కుటుంబ జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని సుఖ సంతోషాలతో పాడిపంటలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానని శాంసన్ పేర్కొన్నారు.

- బెల్లంకొండ, జనవరి 13 (నిఘా న్యూస్):

## తెలుగు ప్రజలకు సిఎంల శుభాకాంక్షలు

### సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన బాబు, రేవంత్

**హైదరాబాద్,జనవరి13(నిఘా న్యూస్):** కొత్త ఏడాదిలో వచ్చే తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి. మూడు రోజుల పాటు జరిగే ఈ పండుగ తొలిరోజు భోగి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలు తెలుగు ప్రజలకు భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. భోగిమంటలతో సమస్యలు తీరిపోయి ప్రతి ఇంటా భోగ భాగ్యాలు కలగాలని ఇద్దరు సీఎంలు ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికి సీఎం చంద్రబాబు భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. 'పవిత్రమైన ఈ భోగి పండుగ మీకు, మీ కుటుంబానికి కొత్త వెలుగులు తేవాలని, పాత బాధలు పోయి సానుకూల దృక్పథంతో జీవితంలో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. భోగి మంటలతో మీ సమస్యలన్నీ తీరిపోయి మీకు భోగ భాగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తున్నాను. మీ ఆశలు, ఆశయాలూ తీర్చడానికి ప్రజాప్రతినిధులుగా మేం అన్ని వేళలా మీతోనే ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను. మీ అందరికి మరొక్క మారు భోగి పండుగ శుభాకాంక్షలు.' అని ట్వీట్ చేశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలుగు ప్రజలకు భోగి పండుగ సందర్భంగా శుభాకాంక్షలు చెప్తూ ఇలా ట్వీట్ చేశారు. 'పాత నిర్బంధపు చీకట్లను రూపుమాపుతూ, కొత్త కాంతులు పంచే భోగి మంటలు... ప్రజా పాలన తెచ్చిన మంచి మార్పులతో ప్రతి ఇంటా భోగభాగ్యాలు వెల్లివిరియాలని' ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తూ అధికారిక ఖాతాలో ట్వీట్ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో తమ్ముడు మృతి అన్నకు గాయాలు





**మధిర, జనవరి 13(నిఘా న్యూస్):** ఖమ్మం జిల్లా మధిర మండలంలోని మడుపల్లి సమీపంలో టిప్పర్ లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరికి గాయాలు అయినా ఘటన సోమవారం చోటు చేసుకుంది.మధిర పట్టణానికి చెందిన కొమ్ము దుర్గాప్రసాద్, అజయ్ ఇద్దరు అన్నదమ్ములు మధిర నుంచి బైక్ పై బయ్యారం వైపు వెళ్తున్నారు.మడుపల్లి గ్రామ సమీపంలో వీరిని మట్టి లోడుతో వస్తున్న టిప్పర్ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తమ్ముడైన దుర్గాప్రసాద్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా అన్న అజయ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో అజయ్ ని వెంటనే మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవలు కోసం ఖమ్మం తరలించారు.పట్టణ ఎస్ ఐ ఎన్. సంధ్య సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి,పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రోడ్డు భద్రత గురించి తెలుసుకోండి

### వాహనదారులకు మంత్రి సీతక్క హెచ్చరిక

**ఆసిఫాబాద్,జనవరి13(నిఘా న్యూస్):** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాహనదారలు రోడ్డు భద్రత గురించి తెలుసుకోవాలి అన్నారు. బీర్లకు, బార్లలో ఖర్చు చేస్తున్నారు.. కానీ ప్రాణానికి రక్షణనిచ్చే హెల్మెట్ కోసం మాత్రం ఖర్చు చేయడం లేదని వాపోయారు. జిల్లాలో గత ఏడాదిలో 213 మంది చనిపోయారు.. మనతో పాటు మనల్ని నమ్ముకున్న వాళ్లు ఉంటారు.. అందుకే రోడ్డు భద్రత ప్రతి ఒక్కరు పాటించాలని మంత్రి సీతక్క తెలిపారు. ఇక, వాహానాలు ఎక్కి డ్రైవింగ్ చేసేటప్పుడు మద్యం సేవించరాదు.. సెల్ ఫోన్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ చేయరాదు అని సీతక్క సూచించారు. అలాగే, ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని వెల్లడించింది. శిరస్త్రం లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు రోడ్డు మీదకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రమాదాలు తగ్గిపోతాయని మంత్రి సీతక్క చెప్పారు.

# రంగన్న గూడెంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**బాపులపాడు, జనవరి 13 (నిఘా న్యూస్):** కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గం, బాపులపాడు మండలం, రంగన్నగూడెం గ్రామ పంచాయితీ పరిధిలోని సింగన్నగూడెం గ్రామంలో రంగన్నగూడెం రూరల్ డెవలెప్మెంట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరంలాగే సోమవారం సాంప్రదాయ సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ఇష్టదైవం వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం గ్రామ ప్రముఖులు, సాగునీటివినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు, నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు రిబ్బన్ కట్ చేసి సాంప్రదాయ సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. అనంతరం ఆర్.ఆర్.డి.ఎస్ అధ్యక్షులు పి.ఎ.సి.ఎస్ మాజీ చైర్మన్ తుమ్మల ధశరధరామయ్య, ఆర్.ఆర్.డి.ఎస్ కార్యదర్శి ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు సమ ఉజ్జీలుగా ఉండి ఎన్.ఆర్.ఐ లు, ప్రజాప్రతినిధులు, గ్రామ టిడిపి నాయకుల సమక్షంలో సాంప్రదాయ కోడిపందేలను నిర్వహించి భోగి, సంక్రాంతి విశిష్టతలను యువతీయువకులకు గ్రామ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన జన్మభూమి స్ఫూర్తితో గన్నవరం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు సూచనలతో ప్రస్తుతం సంక్రాంతికి సొంత గ్రామాలకు వచ్చిన ఎన్.ఆర్.ఐ లు, పారిశ్రామికవేత్తలు, దాతలు, ప్రజల సహకారంతో ప్రజలు ప్రభుత్వం ప్రైవేట్ పార్టనర్ షిప్ (పి4) విధానం గురించి గ్రామాల్లో చర్చించి గ్రామాల అభివృద్ధికి రాబోయే జన్మభూమి 2.0 ద్వారా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బెజవాడ వెంకట కృష్ణారావు, గ్రామ టి.డి.పి అధ్యక్షులు మొవ్వా వేణుగోపాల్, గ్రామ ప్రముఖులు కసుకుర్తి అర్జునరావు, మరీదు



తిరుపతిరావు, సంక్రాంతి సంబరాల ఆహ్వాన కమిటీ సభ్యులు పల్లగాని వీరాంజనేయులు, గరికపాటి వరప్రసాద్, పల్లగాని శ్రీనివాసరావు, బెజవాడ శ్రీను, మరీదు రాము, పల్లగాని మురళి, యడవల్లి స్వామి, కొనకాల శివ, దువ్వూరి దావీదు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంక్రాంతి సంబరాలు ముగ్గుల పోటీల్లో విజేతలకు ప్రజాప్రతినిధులు బహుమతులు అందచేశారు.



## భోగి వేడుకల్లో పాల్గొన్న కేటీఆర్ ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, జనవరి 13 (నిఘా న్యూస్):** హైదరాబాద్ గచ్చిబౌలిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నివాసంలో భోగి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, సబితా రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, పాడి కౌశిక్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, సీనియర్ నాయకుడు కార్తీక్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో భోగి సంబరాలు

**ఉప్పల్ ట్రాఫిక్ సిఐ లక్ష్మీ మాధవి**





**ఉప్పల్, జనవరి 13(నిఘా న్యూస్):** ఉప్పల్‌లో ట్రాఫిక్ పోలీసులు పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం భోగి పర్వదినాన్ని సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. తమ ఇళ్లుగా భావించి భోగి మంటలు వేసి భోగి పండుగ సంతోషాల మధ్య సంబురంగా జరుపుకున్నారు. ఉప్పల్ ట్రాఫిక్ సీఐ లక్ష్మీమాధవి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది కలిసి భోగి మంటల చుట్టూ ఆడుతూ , పాడుతూ, కోలాటం ఆడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ ట్రాఫిక్ సీఐ లక్ష్మీ మాధవి మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ కోసం అనునిత్యం రోడ్లపై ఉండే తమ సిబ్బందితో కలిసి ఒకే ఫ్యామిలీగా భోగి పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.ప్రజలందరి కష్టాలు భోగిమంటల్లో కాలి పోయి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ భోగి సంక్రాంతి కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజలందరూ ట్రాఫిక్ రూల్స్ ను పాటించి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు.

## కొన్ని పోలీస్ స్టేషన్లు... సబ్ రిజిస్ట్రార్ అధికారుల లంచం పిచ్చిని వదిలిస్తాను

**ఇకనుండి నా మార్కు పాలన చూపిస్తాను**

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్‌నగర్, జనవరి 13(నిఘా న్యూస్):** తెలంగాణ లో పేద ప్రజల సంక్షేమం కోసమే అహర్నిశలు పాటుపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో నేటి సంక్రాంతి తెలంగాణ రాష్ట్రానికి నూతన క్రాంతి చేకూర్చబోతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాంధ్యంలో కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకొని ఈ సంక్రాంతికి నాలుగు సంక్షేమ పథకాలను ప్రజలకు అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. షాద్ నగర్ నియోజకవర్గంలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యంగా మూడు ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతి పెరిగి పోయిందని మీడియా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఎమ్మెల్యే శంకర్ స్పందించారు. గత ప్రభుత్వం నాటి ఆనవాళ్ళతో ఇంకా అక్కడక్కడ కొన్ని ముదురు కేసులు మిగిలిపోయాయని అలాంటి వారి పరిస్థితి తనకు తెలుసని సంక్రాంతి తర్వాత సదరు ప్రభుత్వ శాఖల అధికారులను పిలిపించి మాట్లాడతానని ఎమ్మెల్యే శంకర్ హెచ్చరించారు.

ముఖ్యంగా షాద్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పెరుగుతున్న అవినీతి పట్ల ఎమ్మెల్యే శంకర్ తన దృష్టికి వచ్చిందని స్పష్టం చేశారు. ప్రజలను లంచాల కోసం పట్టిపీడించి తింటే ఊరుకునే ప్రసక్తే లేదని తన మార్క్ పాలన ఏమిటో చూపిస్తాను అని హెచ్చరించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని కొన్ని ప్రభుత్వ రెవెన్యూ శాఖలతో పాటు కొన్ని పోలీస్ స్టేషన్లో మితిమీరిన అవినీతి ప్రజల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు తదితర భాగోతాలు దృష్టికి వస్తున్నాయని, ఇలాంటివి సహించబోనని అన్నారు. కొందరు అధికారులు ఏకంగా దుకాణాలే తెరిచిన అంశాలు కూడా ఎమ్మెల్యే దృష్టికి ఈ మీడియా సమావేశంలో వచ్చాయి. అలాంటివారిని ఉపేక్షించబోనని అక్కడక్కడ కొంతమంది ముదురులు ఉన్నారని ఏం చేయాలో తనకు బాగా తెలుసని తన మార్క్ పాలన త్వరలోనే మొదలవబోతుందని అన్నారు. తన కార్యకర్తలు తప్పు చేస్తే కూడా తాను సాహించబోనని ప్రజలకు



ఇబ్బందులు సృష్టించే పనులు ఎవరు చేసినా ఉపేక్షించబోనని అన్నారు. ప్రజలకు నష్టం కల్పిస్తూ వారిని పట్టిపీడిస్తున్న వారిపై నిఘా ఉంటుందని దీనికి త్వరలోనే ఒక పరిష్కారం కూడా ఉంటుందని ఎమ్మెల్యే హెచ్చరించారు.

ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మండల పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి శ్రీకాంత్ రెడ్డి వీరేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంద్రతి బాలరాజు గౌడ్, మాజీ జెడ్పీటిసి వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీపీ ఇద్రిస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, దంగు శ్రీనివాస్ యాదవ్, పురుషోత్తం రెడ్డి, అగ్గనూర్ బస్వం, హుస్సేన్, ముబారక్ అలీ ఖాన్, ఈదులపల్లి రాజు, సయ్యద్ ఖదీర్, లింగారెడ్డిగూడెం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మిస్టర్ ఇండియాగా మహేష్ శర్మ, మిస్ ఉమెన్ గా పింకీ

**ముగిసిన మిస్టర్ ఇండియా జూనియర్ నేషనల్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ 2025 పోటీలు**





**తిరుపతి, జనవరి 13 (నిఘా న్యూస్):** మిస్టర్ ఇండియా జూనియర్ నేషనల్ బాడీ బిల్డింగ్, మెన్ ఫిజిక్ ఛాంపియన్షిప్ ఏషియన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ 2025లో మిస్టర్ ఇండియాగా మహేష్ శర్మ, మిస్ ఉమెన్ గా పింకీ గెలుపొందారని జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి సోమవారం వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ పట్నం నందు లేక్ యు గార్డెన్స్ లో జరుగుతున్న మిస్టర్ ఇండియా జూనియర్ నేషనల్ బాడీ బిల్డింగ్ మరియు మెన్ ఫిజిక్ ఛాంపియన్షిప్ 2025 పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీలకు అనూహ్య స్పందన రావడంతో అన్ని రాష్ట్రాల నుండి వందల సంఖ్యలో క్రీడాకారులు పోటా పోటీగా పాల్గొన్నారు.

ఈ పోటీలలో మిస్టరీ ఇండియా 2025 గా మధ్యప్రదేశ్ కి చెందిన మహేష్ శర్మ టైటిల్ గెల్చుకున్నారు. మహిళల విభాగంలో మధ్యప్రదేశ్ కి చెందిన పింకీ మిస్ ఉమెన్ గా గెలుపొందారు. అలాగే ఆంధ్రప్రదేశ్, తిరుపతి జిల్లాకు చెందిన టి వెంకటేష్ 65 కేజీలు విభాగంలో సిల్వర్,65 కేజీలు విభాగంలో జి.లీల సాగర్ సిల్వర్ మెడల్ సాధించారు. 65 కేజీలు విభాగంలో టీ ఆదినారాయణ ఐదవ స్థానం గెలుపొందారు. వీరు ఫిబ్రవరి 20 నుంచి 25 వరకు మస్కట్ దేశంలో మస్కట్ ప్రభుత్వ నిర్వహించే ఏషియన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ 2025లో పాల్గొ నానున్నారని జాతీయ అధ్యక్షులు ఎలమంచిలి ప్రవీణ్ తెలిపారు. అలాగే కేరళ రాష్ట్రంలోని కొచ్చిన్ నందు సీనియర్ మిస్టర్ ఇండియా 2025 ఛాంపియన్షిప్ జరగనున్నదని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్, చైర్మన్ మోహన్ సింగ్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి జీవీ బాబు,దీపేంద్ర సింగ్ సోలంకి, రితీష్ వీరనాథ్, ఇంటర్నేషనల్ జడ్జ్ షకీల్ (మస్కట్ దేశం) ఎస్ వి శివప్రసాద్, ఏ. భాస్కర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

## జంప్ రోప్‌లో వెండి పథకాన్ని సాధించిన షాబాజ్ ఖాన్





**కూకట్‌పల్లి, జనవరి 13(నిఘా న్యూస్):** అంతర్జాతీయ స్థాయి జంప్ రోప్ ఛాంపియన్ షిప్ లో మొట్ట మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రం నుండి వెండి పథకాన్ని 13సంవత్సరాల బాలుడు షాబాజ్ ఖాన్ సాధించడం జరిగింది. ఇండో నేపాల్ జంప్ రోప్ ఛాంపియన్ షిప్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి వెండి పతకం సాధించిన షాబాజ్ ఖాన్‌కు తెలంగాణ రాష్ట్ర జంప్ రోప్ జనరల్ సెక్రెటరీ ఎం.రాజేంద్రప్రసాద్ అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాబాజ్ ఖాన్ ఈ విజయం ద్వారా జంప్ రోప్ క్రీడలో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠను ప్రపంచస్థాయికి చేర్చాడని కొనియాడారు. షాబాజ్ ప్రతిభ, కృషి, పట్టుదల తెలంగాణ యువతకు స్ఫూర్తిదాయకమని, అతని విజయం రాష్ట్ర క్రీడారంగానికి గొప్ప గౌరవం తీసుకొచ్చిందని అభినందనలు తెలిపారు. జంప్ రోప్ క్రీడలో షాబాజ్ స్ఫూర్తితో మరింతమంది క్రీడాకారులు తయారు కావాలని పేర్కొన్నారు. ప్రతిభావంతుల అభ్యున్నతికి అవసరమైన మద్దతు అందించాలని జనరల్ సెక్రటరీ సూచించారు.

## భోగి మంటలో విద్యుత్ బిల్లులు దహనం



**చింతూరు, జనవరి 13 (నిఘా న్యూస్):** రాష్ట్రంలో ఏర్పడినటువంటి నూతన ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న విద్యుత్ వినియోగదారులపై 16 వేల కోట్లు భారాలు వేస్తూ విద్యుత్ చార్జీలను పెంచిందని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చింతూరు మండలంలో వివిధ గ్రామాల్లో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పల్లపు వెంకట్, కార్యదర్శివర్గ సభ్యులు సిసం సురేష్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని హామీ ఇచ్చి ఎన్నికలు గెలిచిన ఆరు నెలలకే 16 వేల కోట్లు రాష్ట్ర ప్రజలపై బారాలు వేసిందని ఇది అత్యంత దుర్మార్గమని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రజల ఆదాయ స్థాయి పెరగపోక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రజలపై ప్రభుత్వాలు చేసే తప్పిదాలను ప్రజల పైన రుద్దడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలకి రాష్ట్ర ప్రభుత్వాలు బకాయిలు పెట్టి ప్రజల నుండి వసూలు చేయదానికి సిద్ధపడటం దుర్మార్గమని అన్నారు. అదానీతో లోపాయికారి ఒప్పందాలు చేసుకొని విద్యుత్ ను ప్రైవేట్ కంపెనీలకు అప్పచెప్పేందుకు ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రజలందరూ అర్థం చేసుకుని ప్రజా వ్యతిరేక విధానాలపైన నిరసనలు తెలియజేయాలని అన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎర్రం శెట్టి శ్రీనివాస్, ముర్రం రంగమ్మ, వేక రాజ్ కుమార్, పాండు సుబ్బారావు, పాండు నాగార్జున్, కారం రాజయ్య, కలుముల మల్లేష్, కూర సత్యనారాయణ, సోడి లేనిన్ తదితరులు పాల్గొన్నారు.

## రథసప్తమి ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష

- రాష్ట్ర పండుగగా నిర్వహించనున్న నేపథ్యంలో రెండు లక్షల మంది వచ్చే అవకాశం
- ఫిబ్రవరి 4 నుంచి అరసవల్లిలో నిర్వహించనున్న వేడుకలు
- డోనర్ పాసుల కోసం రిజిస్ట్రేషన్ తప్పనిసరి



**శ్రీకాకుళం, జనవరి13 (నిఘా న్యూస్):** ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్న వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. ప్రతి సామాన్య భక్తుడికి సైతం ఆదిత్యుని దర్శనం లభించేలా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ఫిబ్రవరి 4 నుంచి అరసవల్లిలో నిర్వహించనున్న రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమీక్షకు జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర పండుగగా గుర్తించి,మూడు రోజులు వేడుకలు జరగనున్న నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి దాదాపు 2 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని గుర్తు చేశారు. దీనికి అనుగుణంగా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సైతం సులభతర దర్శనం లభించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.గతంలో జరిగిన పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా పోలీసు బందోబస్తు, పారిశుధ్య నిర్వహణ, భక్తులకు తాగు నీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కోరారు. దీనిపై స్పందించిన అధికారులు ఆయా శాఖలు,విభాగాల వారీగా రథ సప్తమికి సమాయత్తం అవుతున్నామని తెలిపారు.డోనర్ పాస్ ఉన్న వారికి ఈనెల 20 వరకు రిజిస్ట్రేషన్ కు అవకాశం కల్పించామని వెల్లడించారు. పాస్ లు కలిగి ఉన్న వారంతా దీనిని గమనించి, సహకరించాలని కోరారు. అలాగే ఏటా తరహాలో శ్రీకాకుళం నగరానికి చెందిన భక్తులు సాయంత్రం సమయంలో దర్శనాలకు వచ్చేలా అవగాహన కల్పిస్తామన్నామని వివరించారు. తద్వారా ఒకే సమయంలో వచ్చే రద్దీని నియంత్రించి, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.





Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com